

# తెమ్మెర

కవిత్వం

సుధామ

# తెమ్మెర

(కవితా సంపుటి)

## సుధామ

స్నేహిత స్రవంతి
జి. 12, సాదత్ టవర్స్, పద్మావతి అపార్ట్‌మెంట్స్
సలీంనగర్ కాలనీ, మలక్‌పేట, హైదరాబాదు-500 036

**T E M M E R A**
(KAVITAA SAMPUTI)
by
**SUDHAMA**

**© SUDHAMA**
98492 97958
sudhama60@yahoo.com

FIRST EDITION : 8th Dec. 2020

Title Cover Concept :
**Smt. Sravanti Snehith Allamraju**

For Copies :
**A.USHA RANI**
Snehitha Sravanti
G.12, Sadath Towers
Padmavathi Apartments
Saleemnagar Colony, Malakpet
Hyderabad-500 036 (Telangana)
Cell : 98482 76929 / 98492 97958
&
All leading Book Shops

DTP & Layout :
MANU GRAPHICS
Chikkadpally, Hyderabad
Cell: 93938 34050

Printed at :
SATISH GRAPHICS
Chikkadpally, Hyderabad-20
Cell: 88851 44422

PRICE : **Rs. 70/-**

“దేశే దేశే కళత్రాణి
దేశే దేశే చ బాంధవాః
తం తు దేశం న పశ్యామి
యత్ర భ్రాతః సహోదరః ”

ముందే వెళ్ళిపోయిన
నా తరువాతి వాడు
తమ్ముడు
అల్లంరాజు దయాల్‌దాస్
స్మృతి కి –

## మిత్రవాక్యం

# 'తెమ్మెర' తో తారాటలు

'మిత్రుల మాటలలో పర్ఫెక్షన్ *(Perfection)*కంటే అఫెక్షన్ *(affection)*కు ఎక్కువ ప్రాముఖ్యం ఇవ్వాలి' అని ఇటీవల వాట్సాప్ *(whatsup)* హితోపదేశాల్లో చూసాను. ఆ ధైర్యంతోనే సుధామ గారి వంటి లబ్ధప్రతిష్ఠుల కవితాసంకలనం 'తెమ్మెర'కు ముందుమాట రాయటానికి సాహసిస్తున్నాను.

ఆయన అర్ధశతాబ్దంపైగా సాహితీ క్షేత్రాన్ని వివిధ ప్రక్రియల ద్వారా సుసంపన్నం చేస్తున్న కృషీవలుడు, స్నేహశీలి, సౌజన్యమూర్తి. సహోద్యోగులుగా మేము ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రంలో కలసి పనిచేశాం. వారి సతీమణి ఉషారాణి, నేను ఆప్తమిత్రులం అవటంతో మా రెండు కుటుంబాల మధ్య స్నేహం గత రెండు దశాబ్దాలుగా దృఢపడుతూ వచ్చింది. ఇంతకు మించి ముందుమాట రాసేందుకు నాకున్న ప్రత్యేక అర్హతలు ఏమీ లేవు. ఒక సాధారణ పాఠకురాలిలాగా సంకలనంలోని కవితలను చదివి నా అనుభూతులను మీతో పంచుకుంటున్నాను. క్లుప్తంగానే సుమా!

'తెమ్మెర' అంటే నిఘంటువు – గాలి అని అర్థం చెపుతుంది. వ్యవహారంలో మనం ఈ శబ్దాన్ని హాయిని గొలిపే, ప్రమోదాన్ని కలిగించే, స్వాంతన చేకూర్చే స్వభావాన్ని కలిగిన చిరుగాలిగా స్వీకరిస్తాం. "పలుకు చందనం" అంటూ తన మాటను మన ముందు ఉంచారు సుధామగారు. ఇందులోని కవితలన్నీ 'గంధవాహులే' అన్న సూచన అందుకుంటాం.

నేనేమంటానంటే –ఈ 'తెమ్మెర' తాను మసలిన తావులన్నింటి సౌరభాలను అలదుకుని, మనలను స్పృశించి, ఆత్మీయంగా పలకరించి అంతర్నేత్రాన్ని తెరచి ఆత్మోన్ముఖులు కమ్మంటుంది–అని.

ఒకచో "వీధిబడి" పాఠాలు నేర్వమంటుంది. ఒకచో "వేదికావిలాపం" వినమంటుంది. కవిసమ్మేళనాలలో శ్రోతవు కమ్మంటుంది. దసరా, దీపావళి వేడుకలు కనమంటుంది. ఖండాంతరాలకు కొనిపోతుంది. 'కరోనా' కాలంలో ఇదెలా సంభవం? అనుకోకండి! కావలసినంత ధైర్యం సమకూర్చి, అవసరమైన సామాగ్రిని చేకూర్చి, "జవాన్"గా మారి పోరాడి "విజేత"వు కమ్మని ఆశీర్వదిస్తుంది. సహకరించే ప్రతివారికీ వందన శతాలు సమర్పిస్తుంది–

"కరోనా విముక్త స్వాతంత్ర్య పోరాటపు
నేటి మాతృభారతికి
అక్షర వందన శతమిది."

అంతేకాదు –

"కడుక్కోవలసిందే !
కరచరణాలే కాదు
కర్మ పరిపాకాలున్నూ"

అంటూ కర్తవ్యం బోధిస్తుంది.

రాయకుండా ఉండలేని కవితలూ, వివిధ సందర్భాలకు అడిగి రాయించుకున్న కవితలూ – స్థూలంగా రెండురకాల కవితల సంకలనం ఇది అన్నారు కవి.

పండుగలు – పబ్బాలు, జయంతులు – వర్ధంతులు, రకరకాల సందర్భాలలో ఏర్పాటు చేసిన కవిసమ్మేళనాలలో చేసిన కవితాగానం కవితలు, నివాళిగా సమర్పించిన కవితాకుసుమాలు, అనువాద కవితలు, 'భట్టుమావ'కు వినిపించిన పిప్పరమెంట్ల వంటి పొట్టి కవితలూ – ఒకదానితో ఒకటి పోటీపడి ఈ కవికి జీవితం @కవిత్వమా లేక కవిత్వం @జీవితమా అని అబ్బురపడేలా చేస్తాయి.

కాళోజీ, సినారె, బాపు వంటి సాహితీ మూర్తులకు, కళాతపస్వులుకు సమర్పించిన కవితాసుమాలు వారి వ్యక్తిత్వాన్ని రూపుకట్టించే వాక్చిత్రాలు.

ఆకాశవాణి జాతీయ కవిసమ్మేళనానికి అనువదించిన అస్సామీ, గుజరాతీ, బోడో వంటి అన్యభాషా కవితలు అన్నీ మౌలిక రచనలనే అనిపిస్తాయి. అధో జ్ఞాపికలు చూస్తేనే కానీ అనువాదమని తెలియదు.

"ప్రతిఒక్క మలుపులో
దాగుంటుంది ఏదో ఒక చిరునామా
కానీ
అడుగులకు చదవటం రాదు"

(ఈ దారి–గుజరాతీ మూలం)

'జ్ఞాత "అజ్ఞాత'ల మధ్య వర్తమాన సామాజిక రాజకీయ జీవన వైచిత్రిని విశ్లేషిస్తారు "(అ)జ్ఞాతం" అన్న కవితలో. ధ్వని ప్రధాన పదప్రయోగం, వ్యంగ్యవైభవం ఈ కవితకు ప్రాణసమానం.

*"మంత్రించు అక్షరాయుధంగా దర్భపై సుధ" అన్న ముగింపు వాక్యం ఆర్కిటైపల్ బింబ విధానాన్ని సూచిస్తున్నది. పరిశోధక విద్యార్థులకూ, పరిణతి చెందిన పాఠకులకూ పని కల్పిస్తుంది. భౌతిక దూరం ఇవాల్టి సామాజిక అవసరం కావచ్చు. కానీ అది మనిషికీ–మనసుకూ దూరంగా పరిణమిస్తే? ఆ ఎఱుక అస్తిత్వ మూలాలను తాకుతుంది. "తనకూ' 'తనలోనితనకూ' పెరుగుతున్న దూరాన్ని పసిగడుతుంది. దగ్గర కావాలనీ, ఐక్యమవ్వాలనీ తహతహలాడుతుంది. ఆ తహతహకు అక్షర రూపవే "దగ్గరగా... రా!"*

కవులన్నా, కవిత్వమన్నా అపార ప్రేమ, అభిమానం. విముఖ స్వరాలు అవరోధ పరచినా, "వద్దులే ఏంరాస్తావ్" అన్నా, "కలం ముడిచి వెళ్లిపోవద్దు! సమస్తశక్తుల మనస్కంతో అను... నే రాస్తా!!" అని సాటి కవులకు సందేశం ఇవ్వటమేకాదు, రాయటం మానివేయనని ప్రతినపూనుతారు సుధామ.

"రాయటం మానేసాను
అని చెప్పని దొక్కటే
అదే నా కవిత్వం..."

కవిత్వాన్ని శ్వాసించే ఈ కవి నుండి మనం మరికొంత ఆశించటంలో అనౌచిత్యం లేదనుకుంటాను. తాత్వికభూమికపై జీవన నాదాన్ని పలికించే కావ్యనిర్మాణం సుధామగారి తదుపరి సంకల్పం కావాలి. అందుకు అంకురార్పణ ఈ సంకలనంలోని చివరికవిత "దగ్గరగా...రా!"లో జరిగింది కాబట్టి, అది పెరిగి, పుష్పించి, ఫలించాలన్నదే నా అభిలాష. 'తెమ్మెర' తో తారాటలకు మీరూ తయారుకండి మరి !!

**–ప్రసన్న**

*(డా.బి.డి.యల్.ప్రసన్న*
*అసిస్టెంట్ స్టేషన్ డైరెక్టర్ (రిటైర్డ్)*
*రీజనల్ అకాడమీ ఆఫ్ బ్రాడ్‌కాస్టింగ్ అండ్ మల్టీమీడియా*
*ఆకాశవాణి, హైదరాబాద్)*

*96030 87689*
*హైదరాబాద్*

# పలుకు చందనం

*వివిధ వ్యావృత్తుల అనివార్యతలో కొంతా,*
*వర్తమాన వాతావరణంలోని అసహిష్ణుత కొంతా*
*కవితా వ్యాసంగాన్ని అప్పుడప్పుడూ ఉద్గమించే*
*అపురూపమైపోతున్న సహజ ప్రకృతి తెమ్మెరలా*
*స్థిరీకరిస్తూండడంతో –*
*తొమ్మిదేళ్ళ తరువాత నా ఈ ఆరవ కవితాసంపుటి*
*రూపుదాల్చింది.*
*రాయకుండా ఉండలేనప్పుడూ,*
*అవసరం ఏదో అడిగి రాయించినప్పుడూ*
*రాసిన కవితలు ఈ సంపుటిలోనివి.*

*వీటిని ప్రచురించిన ఆయా పత్రికలవారికీ,*
*ఆకాశవాణి ప్రసారాలకీ,*
*నా కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను.*

*జీవనసహచరి ఉషారాణి ఉత్తేజ ప్రేరణయే*
*ఉండకపోతే–*
*ఈ మేర కవితావ్యాసంగమైనా అక్షరాభివ్యక్తమయ్యేది కాదు.*
*అందుకు తనకు నా కూరిమి అభినందనలు.*

*ప్రీతిదాయకమైన స్నేహభావనలతో*
*మా సహోద్యోగిగా, సృజనాత్మక అభిజ్ఞతో*
*డాక్టర్ బి.డి.ఎల్.ప్రసన్న*
*(భట్టిప్రోలు దుర్గాలక్ష్మీ ప్రసన్న) ఈ తెమ్మెరకు*
*అందించిన మిత్రవాక్య అక్షర స్పందనకు*
*మనసా ధన్యవాదాలు.*

*సహృదయ పాఠకుల ఎదలకు ఈ సంపుటి*
*సమాదరణీయం కాగలదని ఆశిస్తూ–*

సదా మీ
సుధామ

# తెమ్మెర తెన్ను


1. ఆగతానికి ఆహ్వానం 13
(ఆంధ్రభూమి వారపత్రిక-9 జనవరి 2014)

2. కవీ! 14
(ఆంధ్రభూమి దినపత్రిక సాహితి - 13 జనవరి 2014)

3. దాగిన అంతరం 16
(ఆకాశవాణి జాతీయ కవిసమ్మేళనం 2014
ఆంధ్రభూమి దినపత్రిక సాహితి - 7 ఏప్రిల్ 2014)

4. తానొక జీవన గీత 17
(నేటినిజం దినపత్రిక సాహితీకెరటాలు - 4 సెప్టెంబర్ 2014)

5. అక్షరాశ్రువు 19
(ఆంధ్రప్రభ దినపత్రిక ఆదివారం అనుబంధం-17 సెప్టెంబర్ 2014)

6. తుఫాను 21
(వార్త దినపత్రిక ఆదివారం అనుబంధం-14 డిసెంబర్ 2014)

7. గణతంత్రం 23
(ఆంధ్రభూమి వారపత్రిక - 4 ఫిబ్రవరి 2010

8. నడక (త)లలో 25
(ఆంధ్రప్రభ దినపత్రిక ఆదివారం అనుబంధం-20 జనవరి 2019)

9. పొగ 27
(ఆకాశవాణి జాతీయ కవిసమ్మేళనం 2015
ఆంధ్రభూమి దినపత్రిక ఆదివారం అనుబంధం-15 ఫిబ్రవరి 2015)

10. వేదికా విలాపం 29
(పాలపిట్ట మాసపత్రిక - జూలై 2017)

11. కవుల నోటు 32
(యానాం-కవిసమ్మేళనం - 2016)

12. రెండొకట్లు ఒకటి 33
(ఆంధ్రభూమి వారపత్రిక - 10 ఏప్రిల్ 2014)

13. గురు లఘువు 34
(వార్త దినపత్రిక ఆదివారం అనుబంధం - 8 ఆగస్టు 2010)

14. నీటిచుక్క సిరాచుక్క 35
(ఈనాడు దినపత్రిక - 7 మే 2015)

15. ఇల్ అయిన ఇల్లు 36
(కవిసమ్మేళనం కవిత)

16. వరదాక్షరం 39
(ఆంధ్రప్రభ దినపత్రిక ఆదివారం అనుబంధం - 29 నవంబర్ 2019)

17. (అ)జ్ఞాతం 42
(దసరా కవిసమ్మేళనం కవిత)

18. బ్రతుకు వసంతం 44
(చైతన్యపురి వయోధిక సంఘం కవిసమ్మేళనం కవిత)

19. అతి మాత్రం... 47
(ఆంధ్రప్రభ దినపత్రిక ఆదివారం అనుబంధం - 29 జూలై 2018)

20. బొమ్మర్షి 48
('చిత్ర' మాసపత్రిక డిసెంబర్ 2014)

21. భట్టు మావ పదాలు 50
('కవితా!' సమకాలీన కవితల కాలనాళిక - జూన్ 2009)

22. ప్రణయజలధిలో మోహకెరటం 52
(సాహితీకిరణం మాసపత్రిక - అక్టోబర్ 2018)

23. అసలుకి 55
(దీపావళి కవిసమ్మేళనం కవిత)

24. మౌనమే నీ చప్పుడు 58
('పత్రిక' మాసపత్రిక - అక్టోబర్ 2009)

25. అమ్మ శ్రాద్ధకర్మ 61
(ఆకాశవాణి జాతీయ కవిసమ్మేళనం 2019
మూసీ మాసపత్రిక - ఫిబ్రవరి 2019)

26. రాయడం మానేశా! 63
(వార్త దినపత్రిక ఆదివారం అనుబంధం - 5 ఆగస్టు 2018)

27. అంటరాని వసంతం 66
(ఆంధ్రప్రభ దినపత్రిక సాహితీగవాక్షం - 13 ఏప్రిల్ 2020)

28. తాక(రా)ని సందేశం 68
(నమస్తే తెలంగాణ దినపత్రిక 'చెలిమె' -20 ఏప్రిల్ 2020)

29. విజేతలై నిలుద్దాం 70
(నవతెలంగాణ దినపత్రిక దర్వాజ - 20 ఏప్రిల్ 2020)

30. కూరలబ్బాయ్ 73
(ఆంధ్రప్రభ దినపత్రిక సాహితీగవాక్షం - 4 మే 2020)

31. వీధిబడి 75
(నేటినిజం దినపత్రిక సాహితీకెరటాలు - 7 మే 2020)

32. ప్రతి ఒకడూ ఒక జవాన్ 77
(సాధన సాహితీ స్రవంతి జూమ్ కవిసమ్మేళనం-15 ఆగస్టు 2020)

33. ఇలా ఉండిపోనీ 80
(17 మే 2016 మధ్యాహ్నం వేళ అమెరికా తలపులో)

34. వలసవాసోత్తర కవితలు 82
(ఆకాశవాణి జాతీయ కవిసమ్మేళనం 2016
మూసీ మాసపత్రిక-ఫిబ్రవరి 2016)

35. ఈ దారి 87
(ఆకాశవాణి జాతీయ కవిసమ్మేళనం 2017
మూసీ మాసపత్రిక - ఫిబ్రవరి 2017)

36. మానవ వృక్షం 90
(ఆకాశవాణి జాతీయ కవిసమ్మేళనం 2018
మూసీ మాసపత్రిక-ఫిబ్రవరి 2018)

37. దగ్గరగా...రా! 92
(1 సెప్టెంబర్, 2020)

# ఆగతానికి ఆహ్వానం

వస్తానన్నాక ఎదురుచూడక ఉండేదెలా
జరిగిందంతా తెలిసాక వీడ్కోలుకన్నా
ఆశను శ్వాసించే నిరీక్షణకు
ఆహ్వానం పలుకక ఉండేదెలా

కొత్తదనం అని ఊరించినప్పుడు
మనసు లాగుతుంది
గతంలో మాత్రం అనుభవానుభూతిగా సాగుతుంది

వెళ్ళిపోయేదాన్ని ఆపగలమనే ప్రశ్నేలేదు
ఆ ఎడబాటు అవసరమే
మళ్ళీ తిరిగిరాదని తెలిసినదానికోసం
కన్నీళ్ళు వృధాచేసుకోవడం ఎందుకు
వస్తానన్న దాన్ని సమస్త శక్తులతో
ఆహ్వానించడమే సబబు

దాచివుంచినవన్నీ నీకోసమే పరుస్తుంది
కన్నుల్లోకాదు గుండెల్లో కురుస్తుంది
గతాన్ని కాదు ఆగతాన్ని ఆహ్వానించు
అభిమతాల్ని పెంచి, మరీ పంచు.

# కవీ !

వినవస్తుంది
'వద్దులే ఏం రాస్తావూ'
విముఖించిన అవరోధ స్వరం
జలగలా పట్టుకు లాగేస్తున్న సారం
ఆత్మహత్య చేసుకున్న ఉదయకిరణం సాక్షిగా
అలుముకున్న తిమిరపు అమావాస్య కుట్ర
చీకటి కప్పిన వెన్నెల దుప్పటి

నిద్రపుచ్చే జోలపాటలు - డబ్బు ఘలంఘలలు
కీర్తి మువ్వల రవాలు
శాలువా కప్పి, జ్ఞాపిక చేతులో పెట్టడం ఆలస్యం
గర్వించిన హృదయం సృజనకు సూసైడ్ నోట్ రాసినట్లే!
రాస్తున్న అక్షరం చేప
నీటి బయటపడి
చావుకు గిలగిల్లాడినట్లే!

కొండశిఖరం అంచుదాకా ఎక్కాక
అక్కడ దిగబెట్టినది ఏ హెలికాప్టరో వెళ్లిపోతుంది
ఎక్కినట్లు కనబడుతున్నది నీ కృషి కాక
అందివచ్చిన అదృష్టం
గాలిలోనే మాయమయ్యాక
ఇంక ఎక్కేందుకు ఏం లేనప్పుడు
దిగి రావాల్సిందే కదా!
అక్కడే ఉండిపోలేవు

ఎక్కడం ఎక్కేసావు గానీ దిగడం సులభం కాదు
దూకడమో, దొర్లడమో...
నిన్ను నువ్వు లోలోపలగా చుట్టేసుకుని

'వద్దులే ఏం వస్తావూ' –
అగుపించిన అవరోధవ్రాతం – సమాజ సహజాతం
నిప్పులు చిమ్ముకుంటూ ఎగరావద్దు
నెత్తురు కక్కుకుంటూ రాలావద్దు
సజావుగా నడు
సాము వద్దు నేలవిడిచి
వెళ్ళిపోవద్దు కలం ముడిచి
ఈ రస్తాలోనే సమస్త శక్తుల మనస్కంతో అను –
నే రాస్తా !

# దాగిన అంతరం

ఏ కన్నీళ్ళలో హృదయ సందేశం లేదో
ఏ కన్నీటిలో
పరమ పవిత్ర సత్యం లేదో
ఏ కన్నీళ్ళు
హృదంతరాళం ఛేదించుకు చిమ్ముకుని రావో
అసలు ఏడ్చేందుకు కాని కన్నీళ్ళు ఏవో
అవి నిజమైన కన్నీళ్ళు కావు

ఏ నవ్వులో మలినపు మరక పడిందో
ఏ నవ్వులో పన్నిన కాపట్యపు వల దాగివుందో
అది హాయిగా నవ్విన నవ్వు కాదు

ఏ ప్రణయంలో
సృష్టి మూలాధారం లేదో
ఏ ప్రేమలో నిలబెట్టే నిర్మాణ వాగ్దానం కరువయ్యిందో
ఆ వలపు స్వాగత సమాదరణీయం కాదు

ఏ దానం
ప్రతిగా తిరిగి పొందాలని కాంక్షిస్తుందో
ఏ బహుమతి
ప్రశంసలందుకునేందుకు ఆశిస్తుందో
ఆ కానుక
ఉదారతకి నిదర్శనం కాదు
అది ఔదార్య సూత్ర నిదర్శనం కాదు

(బోడో మూలం : శరత్‌చంద్ర బరొ)

# తానొక జీవనగీత

మీసాలు మొలిచే రోజుల్లోనే
సందిగ్ధ సంధ్యా సమస్యలూ మొలిచేవి
అస్తినాస్తి విచికిత్స వేళల్లో –
దేవుడు... దేవుడు... దేవుడంటూ
బ్రతుకులో అనుక్షణపు దేవులాటనే
అస్తిత్వ ఆరాటంగా విశదపరచిన,
పోరాటం చేయనేర్పిన
అతడొక జీవన గీత.

అనుమానం కలిగినప్పుడల్లా అడిగి విసిగించినా
అక్షరాల సమాధాన బిందువుల్ని
లేఖామృతంగా వర్షించిన
కారుణ్యపు వరదగూడు
తనకు ఊత – ఒక కర్ర
తానెందరికో జీవగర్ర.

చూడడానికీ, చాటడానికీ
బ్రతుకు కమ్మదనాన్ని
కన్నుల్లో చెమ్మగిలజేసే చిత్తశుద్ధినీ
నిజాయితీనీ
'గొడవ గొడవాయిన' ప్రపంచంలో
గొడుగుపట్టి బడుగు జీవుల్లోనూ
తొడిగిన ఆర్ద్ర హృదయజీవి
పరిమళవ్యాప్తితో విస్తరించిన
కలం పూలతావి

జీవితంలో ప్రభాతాలను
ఉద్యమాలుగా ఉద్గమింపచేసి
కానే కాదనుకునే నిరాశలనూ,
అలానే వుంటుందనుకునే దురాశలనూ,
అభివ్యక్తి ఖడ్గచాలనంతో ఛేదించి –
బతుకమ్మకు భాష తురాయిలు తొడిగి
పావురాయి స్వేచ్ఛనూ, శాంతినీ
'రాయి రాయి' అని హాయిగా విడమర్చిన సోయి!

గిట్టని వానిని కొట్టుటకయినా
అనవసరంగా ముట్టని అజాత శత్రువైరి.
ప్రధాని అయిన స్నేహితుడికయినా
ఆచరణలో అడుగువేసే అనుక్షణికాలలోనూ
'తానేమనుకుంటాడో'ననే ఎరుకను
అనుభూతగతంగా నిలిపిన భూతం.

కల్మష మెరుగని ఎద
తన గొడవ అందరి సొద
ఎన్నడూ ఆగక సాగే ద్విపద
వెంటాడి వెన్నాడి వుండే కథ
తాను జీవించిన కాలంలో జీవించివున్నందుకూ
కమనీయ కరచాలనాలు చేసినందుకూ
ఖలీల్ జిబ్రాన్ ది ప్రాఫెట్‌ను
తాను జీవనగీతగా సంతరిస్తున్నప్పుడు
ఎన్ని రాత్రులో ముద్రణకై–
శుద్ధప్రతిని రాస్తూ వద్ద వున్నందుకూ
అచ్చు తప్పుల్నే కాదు,
నా ఆలోచనల తప్పుల్నీ
తన చెంత దిద్దుకున్నందుకూ
కాలానికి అధమర్ణుడిని నేను
కాళోజీకి 'కాల్మొక్కుతా' నేను.

# అక్షరాశ్రువు

స్పర్శ కవిత్వం
లాలన కవిత్వం
ఓదార్పు కవిత్వం
అనుకున్నాను నేను
నువ్వు దుఃఖాన్ని
కవిత్వం చేసావు.

కంటికొసల కారే
కన్నీటి బిందువుల నైతే
కొనగోట తుడవగలం
కారు అద్దం మీద కురిసే
వర్షపు నీటిని తుడిచే
వైపర్స్ లాగానే అనుకో

కానీ
కాలం చట్రంలో బిగిసిన
నీ హృదయ ఫలకం మీద
వర్షిస్తున్న గాయ ధారను
తుడవగల
ఓదార్పు లేపనం
ఎక్కడుందని తెచ్చివ్వగలం

అశ్రువులనైతే
తుడవగలం

నువ్వు
అశ్రువులను అక్షరాలు చేసావు
అక్షరము అంటేనే నశించనిది కదా
అక్షరాన్ని తుడిచే
శక్తి ఎవరికుంది

నీ దుఃఖం పరివ్యాప్తమై
మానవ హృదయ ప్రపంచాన్ని
ముంచెత్తనీ
అక్షరాశ్రువులతో
ప్రక్షాళనమై చితులచింత చల్లారి
పునరుజ్జీవనం
ప్రసాదించనీ

నువ్వు రాయి
చిత్తంలో ప్రతిదెబ్బా
సుత్తిదెబ్బగా మలచిన
మానవ మూర్తివి
సజీవ మహిత శిల్పానివి
ఇలానే రాయి

బాధ హాయిగా
మారిపోయే
ఈ నరేంద్ర లోకమే నీది
అక్షరమే అక్షయమై
మృత సంజీవని కానీ
బ్రతుకు శోభామృత వృష్టికానీ
ఇదే ఉషా రమణీయం
జీవనానంద స్మరణీయం.

# తుఫాను

తీరాలవెంటనే కాదు
తరాల వెంటనంటీ గాలులు పెనుగోలలై వీస్తాయి
చెట్లు కూలుతున్న దృశ్యాలు
విద్యుత్‌స్తంభాలు విరిగిపడుతున్న దృశ్యాలు
కట్టుబాట్లు, విద్వత్‌స్తంభాలూ
కూలిపోతున్నవిగానూ కనబడతాయి

బాట చీలికలవుతుంది...
తోట శ్మశానమవుతుంది
సముద్రాల అల్పపీడన ద్రోణులవల్లనే కాదు
తుఫానులు
మనుషుల అధికపీడన శ్రేణులవల్ల కూడా పుడతాయి.
మనసుల నిస్త్రాణలై ముంచెత్తుతాయి
ప్రకృతి బీభత్సాన్నయినా తట్టుకోగలమేమోగానీ
మానవ ప్రకృతి బీభత్సాన్ని సరిచేసుకోవడం ఎలా?

విద్వేషంలోనూ విభజనలోనూ పుట్టిన తుఫానుకు
సహాయ దృక్కులు తప్ప
సహాయక చర్యలుండకపోతే విషాదం
హుద్‌హుద్ పాల్పడిన విశాఖను త్రుటిలో
మళ్లీ సుందర నగరంగా తీర్చిదిద్దచ్చు

హుటాహుటిన ఏ ప్రభుత్వం,
ఏ యంత్రాంగం తరలి

తెలుగుల హృదయతుఫాన్ బాధితులను
స్నేహపునర్నిర్మాణంతో ఆదుకుంటుంది?
ఎన్ని తుఫానులెదురైనా అంతా ఒక్కటేనన్న
ఐక్యశక్తిని సమీకరిస్తుంది?

చేయి చేయి కలిపిన
స్వచ్ఛహృదయ సహకారం వున్నప్పుడు
తుఫాను ఒక కష్టంకాదు
సౌభ్రాతృత్వ ప్రశాంతతను పాదుకొల్పితే
తుఫాను ఒక నష్టం కానేకాదు.

# గణతంత్రం

మథించే సముద్రంలో
ముందు విషమే విషయం
దిగమింగే శంకరమే శివం
సత్యం ఎప్పుడూ సత్యం

పంపకం కోసమే పట్టుదల
కష్టం సమానమే అయినా
ఫలితం యోగ్యతలబట్టి
నియంత్రించడానికి
ఒక నిర్ణాయక మోహిని

అమృతం అందరికోసమున్నా
అయితేనేం!
ఎవరు అసురులో
ఎవరు అనిమిషులో

ఎంతెంత, ఎవరికెవరికి,
ఎప్పుడప్పుడు, ఎలా దక్కాలో
అంతా చక్రం తిప్పే విష్ణుమాయ

అయిదువేళ్ల సమానత్వ సామెత
కాలంకవ్వం ఎంత కవ్వించి
చిలికినా
చిలికి చిలికి గాలివానలు తప్పవు

గాలివానలో వాననీటిలో
పడవ ప్రయాణాలూ తప్పవు

అగణిత సుగుణ సంధానం
ప్రభుత అనుసంధానం
ఎప్పటికయినా గెలిచేది
గణతంత్రమే
రణతంత్రం కాదు.

# నడక (త)లలో...

నీ తలభారాన్ని
నీవే లాక్కుపోవాలి

ఈ తలనిండా
అవనీతలం పైకి వచ్చాక
అనుభవించిన సమస్త సుఖ దుఃఖాల
అనుభూతి బరువుంది
తలవంచిన సందర్భాలూ
తలకాచుకున్న సందర్భాలూ
ఆ సందర్భాల, మరెన్నో అసందర్భాల
అగణిత ఆలోచనల బరువంతా
తలదాల్చిన తల కదా!

మెడమీద తలకాయ ఉన్నవాడెవడూ
దానినలాగే నిలుపుకోగలడోలేదో కానీ
బరువెక్కిన తలను
ఓ బండి ఎక్కించాల్సి వస్తుంది
తప్పదు
భారాన్నీ, శిరోభారాన్నీ ఈడ్చుడానికి
తోడెవరో ఉంటారనుకోవడమూ భ్రమే!
బండీ నీదే
భారమూ నీదే
నడుపుకు పోవాల్సిన
బాధ్యతా నీదే!

మనఃచక్రాలతో నడిచే
ఈ దేహపు బండి
తల బరువును
తరలించుకుపోవడానికి
పాదాలకు నడక తప్పదు

బ్రతుకు బండెక్కిన తల
విశ్రాంతి తీసుకుంటున్నట్లున్నా
నీ
ప్రయాణం
సాగిపోతూనే ఉంటుంది.

# పొగ

మత మందిరాలూ ఇంకా ప్రార్థనా స్థలాలూ
నా లోపలే
చేయిసాచి బలపడుతున్నాయి

ఎందరో అప్సరసలు, గంధర్వులు
ఎందరో కిన్నెరలు – కింపురుషులు, యక్షులు
ఇక్కడ వరిష్ఠ సాధు సన్యాసుల పంక్తిలో
వచ్చి కూర్చున్నారు

రాత్రి ఓ మలుపు తిరుగుతోంది
నా శరీరంపై మోసులెత్తుతున్నాయి
సహస్రాబ్దుల పురాతన వృక్షాలు, లతలు,
పువ్వులు, ఆకులూ, వేర్లూ
పక్షులూ, జంతువులూ, సరీసృపాలూ
నాపై పారాడుతున్నాయి

వేల ఏండ్ల ధూళి రేగుతోంది
వేలాది వత్సరాల కుళ్ళులో
కాళ్ళు రెండూ కూరుకుపోయాయి
పురాతనం కన్న పురాతనంగా
రక్తమంటిన చేతులు, కన్నీళ్లు నిండిన కళ్లు
అగణిత కాలపు అపస్మారంలో నేత్రాలు
బిగిసిన పెదవుల రాతి కఠినత

నేను ఎలుగెత్తి మాట్లాడాలనుకుంటాను
నా గొంతు పెగలదు
కళ్లు రెక్కలు విప్పుకుంటున్నాయి
నాలుకకు అజరామర దప్పిక
నువ్వు నన్ను నీకు దగ్గరగా లాగుతూంటావు
భళ్లున తెల్లవారుతోంది
నేను మాత్రం లేను

ఖాళీ పరుపు
పరుపు మీద మృతరాత్రి
ఒక జారిపోయిన నిద్ర

రాత్రి నిద్రలో మరణించిన ఆ ముఖాలను
నేను ఏరుతున్నాను
కూలిన ఆ మఠ మందిరాల క్షణకాలం
అదే నా విపన్న కావ్య ఛందస్సు

క్షుణ్ణంగా అరుణోదయమవుతుంది
ఒక మృత కవిత అభేద్యమైన రక్షణ నుంచే
మెల్లమెల్లగా
అసంఖ్యాక అనావిష్కృత దినాల నిశ్చయ జ్ఞానం

నన్ను పొందడానికి ఎంతో వ్యాకుల పడుతున్నావు
కానీ నేనిప్పుడు ఆ జ్ఞానాగ్ని కెరటంలో దాగి
సుడి తిరిగి పైకెగసిపోయే పొగ.

(అస్సామీ మూలం: శ్రీ సమీర్ తంతి)

# వేదికా విలాపం

అడుగు మోపగానే
పడతిగా మారిన పాషాణంలా నాలో
ప్రాణవత్ అక్షర శక్తి ఆవహించేది
ఆసీనమవగానే నా ఎద
పుంభావ సరస్వతి పేరోలగమయ్యేది
గాలికి ఊగే ముంగురులు నాకై
దిద్దుతున్న అక్షరాకృతులుగా తోచేవి
ప్రజ్వలన కాదు ప్రకాశనమని
ఆ చేతులు దీపం ముట్టించగానే
జ్ఞానానంద దీధితులు విస్తరిల్లేవి
ఎంత బిగించి కట్టిన కవి గ్రంథమైనా
ఆయన చేతుల్లో వదులై ఒదిగిపోయేది
ఆవిష్కరణకు నోచుకున్న ఆనందంతో
పుటపుటా పులకించిపోయేది
సాహితీరంగ అంతరంగాలను
ఎదపొరలను ఆవిష్కరించినట్లు
ఆవిష్కరించే విజ్ఞుడు, రసజ్ఞుడు అయిన
ఆయన సందేశంలో నా సమక్షాన
కృతీ, కృతికర్తా ఆనంద హంసలై
రెక్కలల్లార్చుకునేవారు

అధ్యక్షుడయినా ఆవిష్కరణకన్న ముందే
పుస్తకం లో తలుపులు తెరిస్తే
అనౌచిత్య దక్షుడని

చూపులతోనే శిక్షించి
సభాగౌరవాన్ని రక్షించే త్రాత నాకు
తాత అయినా ముత్తాత అయినా
ముని మనవరాలి భావశబలతకు సైతం
తెలుగుతీపి అద్దిన వరేణ్యుడు తాను
గళం విప్పినంతనే
మాటలు మంత్రించినట్లుగా
శ్రోతృ హృదయాలను స్పృశించి
ప్రేక్షక జన రంజనమయ్యేవి
రసప్లావితమై అభిభాషణం అమృతతుల్యమయ్యేది.

ఆ మాటలు
మాణిక్యముల మూటలు
మౌక్తికముల పేటలు
తేనెల ఊటలు
భావార్థాల తేటలు
ఆవిష్కృత గ్రంథ రచయిత భావికి బాటలు
గుణ గ్రహణ పారీణతే తప్ప
రంధ్రాన్వేషణ దృష్టి ఎరుంగని సహృదయుడు
అర్భకుడినయినా భుజం తట్టి అందలమెక్కించే
సౌజన్య నిర్భరుడు

ఏ స్థానంలో కూచున్నా
తన కనుసన్నలలోనే సభను తిప్పుకోగల
గౌరవ శాసకుడు
నిండుదనపు పండు వెన్నెలలు కాయించే
కవి చంద్రుడు

ప్రసంగిస్తున్నంత మేరా అందరి
ఏకాగ్రతనూ, తాదాత్మ్యాన్నీ తనవైపే
కట్టివేసుకోగల దిట్టతనం
కాదంటే కట్టడి చేసుకోగల గట్టితనం
తను నిజంగా శబ్దానుశాసనుడు
అర్థ తాత్పర్యాల విశ్వంభరుడు

కవిత చెప్పినా, గజల్ పాడినా
అభినందించినా, అభిభాషించినా
గాన సభ అయినా, రవీంద్రభారతయినా
రాష్ట్రీయమైనా, విదేశీయమైనా
పాటరాసినా, పాఠం చెప్పినా
సినీ రంగమైనా, విశ్వవిద్యాలయమైనా
పరిషత్తు అయినా, రాజ్యసభ అయినా
భళారే అనిపించుకున్న వాగ్విలాసం

సినారె స్మృతి చెరిగిపోని దరహాసం
తెలుగువాడి గుండెకింది శాశ్వత విలాసం.

# కవుల నోటు

అక్షరాలనే లక్షలుగా భావించి
నిక్షిప్తం చేసుకునేవాళ్లు
అనుభవాల, అనుభూతుల అభివ్యక్తినే
చెలామణీ చేసుకునేవాళ్ళు
జాగృత చేతననే డిపాజిట్ చేసుకుని
మానవ సంబంధాలనే ఫిక్స్‌డ్ వేసుకునేవాళ్ళు
కవులు పెద్దనోళ్ళున్నవాళ్ళేమోగానీ
పాపం
పెద్దనోట్లున్నవాళ్ళు కాదు
తెల్లకాగితం మీద నల్ల అక్షరాలు కూరుస్తారేకానీ
నల్లకుబేరులు కారు
ఏటిఎం అంటే మిషన్లుగాకాక
ఎనీటైం మనుషులుగా మనుగడ సాగించాలనుకునేవాళ్ళు

కరెన్సీ కాగితాలు కాదు
కవిత్వపు కాగితాలు వీళ్ళ ఆస్తి
డబ్బుయావ నిజానికి నాస్తి
రెండువేల నోటు కొత్తకరెన్సీలా
ఫెళఫెళలాడే విలువకలవారే
అయినా చిల్లరగా భావించే జనమమేకమై
అనునిత్యం మారకంలో
మన్నికగా వెలుగొందే మా రకం వాళ్ళు ఈ కవులు
కవులు జనం గుండె పలికించే
నోళ్లున్న వాళ్ళేగానీ
చెల్లుబాటు కాని వొట్టి నోట్లున్న వాళ్ళుకాదు
కరెన్సీ కన్నా కవిత్వపు పొటెన్సీకే విలువ
ఇది అక్షరం చలువ.

# రెండొకట్లు ఒకటి

*చైత్రం ఒక గాత్రం*
*రసఝరీ యోగానికి ఆత్రం*
*ఆకులు వసంతానికి చేవ్రాలు*
*తానే కన్యగానూ, పురుషుడిగానూ*
*కాలం ద్విపాత్రాభినయం చేస్తుంది*
*రెండేవైనా అసలుకి ఒక్కటే!*

*రెండు కళ్లు - ఒకే చూపు*
*రెండు చెవులు - ఒకే శ్రవణం*
*రెండు నాసాపుటాలు - ఒకే ఊపిరి*
*రెండు చేతులు - ఒకే చేత*
*రెండు కాళ్లు - ఒకే గమనం*
*బెంగెందుకు?*
*రెండు రాష్ట్రాలు - ఒకే జాతి*
*హృదయం ఒక్కటే*
*భాష ఒక్కటే*
*భావ ఐక్యమే కావాలి*

*దశలు, త్రిదశలు ఏవయినా*
*ప్రగతి అస్తిత్వంలోకి*
*శ్రీ జయ ఒకే ఉగాది-*
*తెలుగు జిలుగు ప్రాంగణాల్లోకి*
*కొత్త వాకిలి తోరణాల్లోకి*
*అంతఃకరణాల్లోకి.*

# గురు లఘువు

భూమికి తొడపాశం పెట్టి
నీరుని కన్నీరు పెట్టించి
అగ్నిని గుంజీలు తీయించి
గాలి చెవులు మెలేయించి
ఆకాశాన్ని గోడకుర్చీ వేయించి
ఆత్మానందాన్ని పొందడం
ప్రకృతి శిశువుకి పాఠాలు నేర్పే
పరమాచార్య ప్రయోజకత్వం
అని విశ్వసిస్తున్నావేమో గాని-
ప్రేమతో, లాలనతో
పరిరక్షణం చేసి పరిపోషణ చేయలేని
కఠిన శిక్షణం అది!

బోధ చేయవలసిన వాడే
బాధించే శాడిస్టు అవడం
అమానవీయ ప్రకృతం
పర్యావరణ వికృతం

గురువు కాకపోతే పోయె-
నైర్మల్య ధావళ్యబాల ప్రకృతిముందు
హింసాదండం చేబూని
లఘువువై తేలిపోకు.
మనిషిగా కూలిపోకు.

# నీటిచుక్క సిరాచుక్క

*చుక్కనీరే...*
*మనిషి ప్రాణాధారం*
*చెరువు ఎండటమంటే*
*బతుకు ఎండటమే*
*జల సంరక్షణే*
*జన సంరక్షణ*

*పారే నీరేదైనా*
*సముద్రాల పాలుకాక*
*జనగణ ఊపిరిగా*
*ఉపయుక్తం కావాలి*

*బావులు, కుంటలు*
*జలకళతో నిండాలి*
*ఊరు నిలవాలి*
*మనిషి ముందుకు సాగాలి*

*నీరేదైనా ఎండిపోరాదు*
*వర్షపు చుక్కయినా*
*వృథా కారాదు*
*జవం జీవం జలం*
*సంరక్షించుకోవాలి జనం.*

# ఇల్ అయిన ఇల్లు

నాలుగు యాక్సిడెంట్లు, రెండు హత్యలు
ఓ మూడు రేప్‌లు మడతపెట్టి
పొద్దున్నే గుమ్మంలో గిరాటేసి పోతాడు ఒకడు
తన గడ్డి మరెవరో తినేయడంతో
అశ్లీల పోస్టర్లు ఆరగించి
నీళ్ళల్లా స్రవించిన పాలిచ్చిన గేదె పాలకు
మరిన్ని నీళ్లు కలిపి
తిలాపాపం తలా పిడికెడులా పాలో, పాపాలో తెలీకుండా
తనదయిన కొలతతో గిన్నెలో వొంపిపోతాడింకొకడు
రోజు విడిచి రోజు వచ్చే
మున్సిపల్ నీళ్ల కోసం ఇప్పుడు ప్రతిరోజూ నేను
అలారం పెట్టుకు లేచినా
తన దయాదాక్షిణ్యాల మేరకే మోటర్ వేస్తే వేస్తాడు
లేదంటే –అసలు పంపే రాలేదంటాడు మరొకడు
తుడవడానికీ, తోమడానికీ, ఉతకడానికీ
ఉద్ధరింపు వరదహస్తంతో
ప్రవేశించాల్సిన వారు వస్తారో రారో అన్న
సందిగ్ధపు నరాల తీవ్ర వొత్తిడితోనే శ్రీమతి గారు
సుప్రభాత దండకాన్ని పతిపైనే సంధించినా సంధిస్తారు
కనుక ఇప్పుడు
తనకు ఇంట్లో వున్నట్లే వుండడం లేదు
ఇల్లు ప్రశాంతికి చిహ్నమన్న భావనే కలగడం లేదు

ఉదయరేఖలకన్నా ముందు
గాలి తరగలమీంచి తేలివచ్చే దేవాలయం గంటల చప్పుడు గానీ

ముగ్గువేసిన వాకిలి దగ్గర
హరిదాసు చిడతల చప్పుడో, జంగందేవర శంఖనాదమో
ఇప్పుడు చెరిగిపోయిన, చెదరిపోయిన ప్రభాత చిత్రాలే
కలలో కరిగిన స్మృతిరేఖలే.

పల్లెను వల్లె వేయడం మాని
పరదేశాన్ని ధనీకరించుకుని తరలించుకోవాలనుకుంటున్న పాలనలో
నగరం తననూ, తన బుద్ధినీ, తన హృదయాన్నీ కూడా
గొప్ప యాంత్రికం చేసేసింది
తెల్లారింది మొదలు ఇంట్లో ఫోను మోగుతూంటుంది
ఫోనెత్తినప్పుడల్లా
మనుషులు కనబడకుండా గొంతులు మాత్రమే వినిపించే
భూతమేదో ఇంటిని ఆవరించినట్లుంటుంది.
కేబుల్ కనెక్షన్ వున్న టి.వి
ఛానెల్స్‌లో అక్రమ సంబంధాల్ని రంగులుపూసి చూపిస్తున్నట్లుంటుంది
డ్రాయింగ్ రూం ఇప్పుడు బెడ్‌రూంలా భ్రమకొల్పుతోంది
అప్పుడప్పుడు బాత్‌రూమ్ కంపుకూడా కొడుతోంది.

బరువయిన పుస్తకాల బ్యాగ్‌తో
బుద్ధి బలం మాటేమోగానీ భుజబలవ్యాయామం చేస్తున్న
కుర్రాడు – కలమూ కాగితాలూ పాతబడ్డాయి
కంప్యూటర్ కావాలంటున్నాడు.
ఇంటర్‌నెట్ మాటేమోగానీ ఇంట ఏదో నెట్ (వల) బిగుస్తోంది
వాడి బుర్రనిండా ఎప్పుడూ పరీక్షలే
వన్‌డే మ్యాచ్‌ల టెన్షన్లే
కోతికొమ్మచ్చీ, నేలబండా, గుజ్జనగాళ్లు
వారు పేర్లయినా ఎరుగని పురాతన క్రీడలు
ప్యాకెట్‌మనీ ఇస్తే షేర్లు కొనుక్కోడానికి పనికిరావాలి కదా
అని వాళ్ల ఆలోచన.

గ్రంథాలయం పేరెత్తకు
పాడుబడిన గుడి అయినా తెలుసేమోగానీ
అదేమిటో అస్సలు తెలీదు.
నా ఇంట్లోనే నేను చితక్కొట్టబడ్డాను నేడు
ఇల్లు ఇప్పుడు ఇల్లే అనిపిస్తోంది
అవును! ఆంగ్లీకరించబడిన తెలుగువాడుకదా
తన ఇల్లు 'ఇల్' గానే వుంది
ఇదంతా జ్వర ప్రకోప సంధిప్రేలాపనే నేమో

త్రిభువనాల్లో తీండ్రిస్తున్న ఈ అసుర కాలహేళి నణచి
శివేతరాన్ని క్షతం చేసే సామాజిక శక్తిని
ప్రతి ఒక్కరిలో నిక్షిప్తం చేస్తే తప్ప
కలి–అంతా ఖాళీ చేయడం ఖాయం
కవి గోడు కూడా ఇదే –
అనవరత ఆలోచనా శక్తిని జాగృతపరచడమే ధ్యేయం.

# వరదాక్షరం

వరద– జలరూపమే. కాదేమీభ్రమ
ప్రళయాకృత సంభవ సంభ్రమ.
బురద రాజకీయంగా
అంతకుముందుగానే విభ్రమ.
ముంపు నుంచి నిజమే ఓ కంపు.
కానీ ఛిద్రమానవ సంబంధాలను
సేవా తత్పరత పేర అదే దింపు – ఒక సొంపు.
నదులు ముంచెత్తడం మాటేమోగానీ–
పంటకాల్వల వెంట పరీవాహకమవ్వాలని
ప్రతిష్ఠించిన ప్రాజెక్ట్‌ల కొన్నిటి చందం
ఇన్‌ఫ్లోలు ఔట్‌ఫ్లోలు కారణమై క్యూసెక్కులు క్యూసెక్కులుగా
ఊళ్ళు మునిగిపోవడం విషాదం.

జలప్రళయం జనించడం
ఏ ప్రకృతి రోషకషాయిత నేత్రరోచిస్సో!
ఇది ఏ తప్పిదాల అజ్ఞానాంధ తమస్సో!
అక్కడ వరదల్లో విలవిల్లాడుతున్న వారితో బాటు
ఛానెల్స్ పుణ్యమా అని
మన నట్టింట్లోకీ చర్చల వరద
రిపోర్టింగ్ సరదా
రాజకీయంబురద ముంచెత్తి
దృశ్యమాధ్యమ శ్రవణోత్పాతాలతో మరింతగా
గిలగిల్లాడింది హృదయం
మీట నొక్కితే తెరపై ఆవిష్కృతమైనది భయం.

నీరు కన్నీరై తరగలెత్తింది
ప్రాణాధార హృదయాంతరంగ గంగవున్న
శివుడి జటాజూటాన్ని అనవసరంగా
ఏ భగీరథులు విడగొట్టారో
గోత్రభిదాయుధులై
ఎవరు – కాపాడే కొండరెక్కలను పడగొట్టారో
సాఫీగాసాగే ప్రవాహాలను నిరోధించి
జలదిగ్బంధనం పేర
చెరువులను, కుంటలను ఎండగట్టి
భవంతులు నిలబెట్టి, నదుల అనుసంధాన తొడలుగొట్టి
సజావైన ప్రకృతిశక్తుల ఉనికికీ అధికారాంధులు
సవాలుచేసి అసమతుల్యతల కాలరెగరేస్తే కదా
కాలమైందిక కడలి ఉగ్ర పంజాల దెబ్బలకాలవాలం.

అయింది ఎలాగూ అయ్యింది
ఆదుకునే పేర ఇప్పుడు
ఆపన్నహస్తాలు పన్నగవిషమస్తకాలై
వరదరాజులుగా మారేవారి
అవినీతి అక్రమాలపై నిఘావేయాలి.
వరద బాధితులకు సహాయాల పేరిట
దగాలకు దిగే సంస్కార దరిద్రులను
కనిపెట్టి, పనిపట్టి
అసలు సిసలు, కరకట్టలు నిర్మించాలి
వుండొకచోట, మందొకచోట తీరుగాక
కన్నీటి నేత్రస్థలినే ఓదార్పు విరళమవ్వాలి

పార్టీల పౌరుషాలుకాక
బ్రతుకు పరుషాలు కుదుటపడి సరళమవ్వాలి

కలం చుక్కైనా కరుణ రెక్కవిచ్చి
ఆర్తుల ఆసాంత సాంత్వనమవ్వాలి తప్ప –
కవిత్వమైనా వరదై, దురదై, బురదై
జనహృదయ పంకిలం కారాదు.

వరద బాధితులకు
మానవత్వమే అభయహస్తం.
అందరికీ మేలు ఒనగూరాలనే
మన
ఆశయ సమస్తం.

# (అ)జ్ఞాతం

పాండవులంటూ కొందరు
అజ్ఞాతవాసంలో వున్నారో లేదో తెలీదు
కానీ
కౌరవులు విచ్చలవిడిగా సంచరిస్తున్నారు.
దుశ్శాసనులు, కీచకులదే కాలం.
శకుని పాచికల ఆసరాతో దుర్యోధనులు
జబ్బలు చరుస్తూనే వున్నారు.
సామాన్యుల శ్రమశక్తుల పాడిపంటలను
గోగ్రహణం చేసి తరలించుకుపోతూ
పశుగ్రాసాన్ని కూడా వదిలిపెట్టడం లేదు.

సమాజ శమీవృక్షంపై
మేధావుల ఆయుధాలు శవసదృశంగా వున్నాయి.
వలలుడు వండుతున్న వంట
పాకాన పడుతోందో లేదో!
నాట్య సుశిక్షితాలైన బృహన్నల హస్తపాదవిన్యాసాలు
యుద్ధస్పృహే కదా!
ఎంతకాలమో పేడితనం?
ఎంత నిరసనోద్యమం నిర్వహించినా
సైరంధ్రికి మద్యం సరఫరా పని బందుకాలేదు.
కన్నుగీటే కీచకుడి వలయంలోకి
రక్షకభటుడి అక్కే రాకపోకలు పురమాయిస్తోంది.
గూండాయిజం దాదాగిరీ వర్తనహేల
నర్తనశాలలో ఏ రాత్రి ఏ ముసుగువీరుడు ముగిస్తాడో తెలీదు

కంకుభట్టు కణతనుండి
రక్తపుబొట్లు కారకనేనా
సైరంధ్రి చీరచెరగులు చిరిగిపోతున్నాయి
పన్నెండేళ్ళేం ఖర్మ
అరణ్యవాసాలే అనుకూలం అనుకుంటున్నవారూ వున్నారు.
అన్నల ఆవాసమని తమ్ముళ్ళు తీర్మానించుకుంటున్నారు.
అడివే - మనిషి ఆదిమ నివాసం కనుక
జన్మభూమికి జయజయనాదాలు ప్రతికూలధ్వనులిస్తున్నాయి.
ఇన్నేళ్ళ చిత్రభారతం పులివేషమై
ప్రగతిడప్పు మీద నర్తించడానికి ఆయాసపడుతోంది.
సాంస్కృతిక వికాసమంతా బృహన్నల వాసనేస్తోంది.
నిజం - ఈ జీవనం దసరానాటి పగటవేషంగా
వర్తమాన రండోళ్ళ వాతావరణ వాయిద్యాలకు
అనుగుణంగా ఎగరడమే పులిపనిగా జీవిస్తోంది.
అంతరంగంలో ఆవేదన గూళ్ళు పెరిగినా, హాయిగా కేకలు వేస్తూ
భీరువైనా మేరువులా నిలిచినట్లు
పంచరంగుల దృశ్యాల ఛానెల్‌గా భ్రమలు పేనుతోంది.

ఇప్పుడంతా నటన
అజ్ఞాతవాస వేషాల పేరున అంతా మిష
దర్గాకు కొమ్ముకాస్తే దుర్గా.
సమీకృతమయ్యే వర్గాల వైరుధ్యాల్లోంచే ఒక లక్ష్యాల సంసర్గ.
ఆయుధం పదునెక్కాలి ఆలోచనగా
రానున్న అసలు సిసలు స్వాతంత్ర్య కురుక్షేత్ర సంగ్రామానికి
ఇప్పుడు ప్రాతిపదికలు పడుతున్నట్లే వుంది.
ఆ దశ రాకే ఇప్పుడీ దసరా
ఇది పైపై సరదా. ఇక సంధించాలి శరపరంపర పదపద
మంత్రించు అక్షరాయుధంగా దర్భపై సుధ.

# బ్రతుకు వసంతం

గుడిలోనూ గుండెల్లోనూ
గంటలు మ్రోగుతూంటాయి
అయినా–
అనిపించే క్షణాలుంటాయి
అవును! శోకభీకర తిమిర లోకైకాధినేతగా
కాలమ్మొకటే కారురూపుగా
నావలెనే నా బ్రతుకువలెనే అని క్రుంగిపోయే
మనోవికారి బికారిలా పొడగట్టే
ఒక గుండెగుడుసుళ్ళ బాధా తెరతీసుకుంటుంది

గది
గదిలో మంచం
గోడకు రంగుల ప్రపంచం చూపే
దృశ్య శ్రవణ మాయాదర్పణం,
అందుబాటులో ముఖపుస్తకాల, వాట్సప్ ఛాట్‌ల
సెల్‌ఫోన్ – అన్నీ వుంటాయి
కానీ కమ్ముకున్న ఏకాకితనపు ఒంటరిభావన
అగాధపాతాళ కుహరాల వేదనా ప్రతిధ్వని

ఏదీ హృదయస్పందనం
ఒక మాట కరువు
ఒక చూపు కరువు
ఒక స్పర్శ కరువు
కళ్ళకు కళ్ళజోడు చేతికి చేతికర్రే తోడు
గదిలోకి ఎవరూ తొంగిచూడరు
రాత్రి దగ్గుతెరల గురించి పరామర్శించరు

వృద్ధాప్యం
వసంతం వలసపోయిన శూన్యపు తోటలా వుంటుంది.
ముసలితనం సంవత్సరాది ఎలా అవుతుంది
మునిమాపువేళ ప్రభాతకిరణం సోకుతుందా?
కన్నపిల్లలే పరాయీకరణలోకి నెట్టాక
పలకరింపులే లేని బ్రతుకువేగంలోకి వెళ్ళి
తమకు సమయం వెచ్చించడమే వృథా అనుకుంటున్న
వారి వైఖరి ఏ తియ్యదనాలనిస్తుంది.
ఎలా సంతోషపడనిస్తుంది.
ఉన్న బి.పి. షుగర్‌లకు, వేసుకుంటున్న మందులకు
చేస్తున్న అనివార్య ఉపవాసాలకు
శరీరం యొక్క అస్తిత్వం తప్ప
ఆత్మానందపు గుడ్డిదీపం–ఆరిపోయేదెప్పుడో తెలీక
రెపరెపలాడుతూనే వుంటుంది.
ఆశలా అనుక్షణం శ్వాసిస్తూనే వుంటుంది.

ఒక జ్ఞాపకాలే చుట్టూ వుంటాయి
గతం ఒక్కటే అవగతం అవుతూ ఆసరాగా వుంటుంది
ఇంట్లోంచి వెళ్ళిపోయిన కొడుకో, విధవగామిగిలిన కూతురో
ఇల్లాలి చిరంతన స్మృతియో
పేరు మాత్రమే మిగుల్చుకుపోయిన పెనిమిటి కీర్తియో
పడుకున్నా కునుకుపట్టక కుదిపివేస్తూంటాయి
ముసలితనం అనుభవాల–జ్ఞాపకాల అల్మారా
తెరిచే ఓపిక లేకున్నా
తాళం లేని తలుపులతో ఎదురుగానే వుంటుంది.

ఏటికేడాది వయసు వస్తూంటుంది
ఏమి మారినది ఈ లోకంలో అని ఆలోకనం ఆవిష్కృతమౌతూంటుంది.
నిజమే
కానీ బ్రతుకు గొప్పది – ఆత్మబలం గొప్పది

జగమంతా నా కుటుంబమే అనుకున్నప్పుడు
ప్రేమలు కుటుంబానికే కాక
అనాథలవైపూ విస్తరించి వికసిస్తాయి

వృద్ధాశ్రమాలు అనాథ శరణాలయాల్లాకాక
వానప్రస్థాశ్రమపు తపోవాటికల్లా దీపిస్తాయి
టెంక లాంటి శరీరం త్యజింపబడినా
మామిడిపండు మధుర రసాస్వాదనే
ముముక్షారసం అని గ్రహిస్తే
కాకిగోల అని ఏదీ అనిపించదు.
అంతా కోకిల గానమే!

విస్తరించిన పొడి అక్షరాలుగా
ఉగాది అంటే
**ఉ**డిగిపోయినా **గా**డితప్పని **ది**వ్యజీవనం
అదే వృద్ధాప్యం.

# అతి మాత్రం...

ఒకటికి పదిసార్లు లేవాల్సి వస్తుంది
రాత్రి కొంచెం కొంచెంగా చుక్కలు
దులిపేసుకున్నాక
చీకటి దుప్పటి కప్పుకు పడుకుందామనుకున్నా
నేత్రకాంతే అడ్డుపడుతున్నట్టుంటుంది
వెలుగు ఇష్టమే! – కానిదెవరికి

దుఃఖాన్ని పరుచుకున్నప్పుడు
దిగులు మేఘం మనఃచంద్రుడిని కప్పివేస్తుంది
రోగమో రొష్టో తెలియదు
నిద్రను శకలాలు శకలాలుగా చేసుకుని
ఆస్వాదించడమంత అసహనం మరొకటి లేదు

స్వప్న విరామాలెరుగని గాఢ నిద్రకోసం ఆరాటం
పగటికి ఎలాగో సరిపుచ్చుకున్నా
రాత్రి బాధే కలవరపెడుతుంది
బస్సు ప్రయాణాలు ఎలాగూ పడవు
పట్టాల పరుగు పెట్టెలో అప్పర్ అన్నా
ఆరోహణ అవరోహణల దేహ సంగీతం
అపస్వర బాధితమే

వెలుగు వెలిగితే ఆరోగ్యం
దిగులు మెలిగితే ఆ రోగం
అతిని నియంత్రించే యతివి కావాలంటే
మతిని శ్రుతి చేయాలి
ఔషధం ప్రసాదమయితే అది చాలు
దేహాలయమే దేవాలయం
స్వస్థతే సమారాధనం
అతిమాత్రం... అంచెలంచెల నిధనం.

# బొమ్మర్షి

బాపుని చూసి–
సృష్టికి ముందు 'హెూంవర్క్' చేయడం నేర్చుకొమ్మని
బ్రహ్మకు వాళ్ళమ్మ చెబుతోంది

'బొమ్మ' అంటే 'బాపుబొమ్మ' కదా అని
ఆయువు తీరిన ఆడవారు సైతం
స్వర్గంలో ఆనందిస్తున్నారు.
'స్నేహం' అంటే ఇదా అని
'రమణిం'చిన బాపుని చూసి
సురాసురులు తెలుసుకు 'మురుసు'కుంటున్నారు.
తమను  ఎంతో అందంగా చిత్రించడం వల్లే
కనబడితే మానవాళి కాదు పొమ్మంటారేమోననే
ప్రత్యక్షమయ్యే పరిస్థితి పోగొట్టుకున్నాం లెమ్మని
దేవీదేవతలు బాపుకు
సెలవుదినాల సంబరాలతో దణ్ణాలెడుతున్నారు.

'బాపు'యే భువి జన్మించకపోయుంటే
వ్యంగ్య చిత్ర వైభవం వెల్లడయ్యేది కాదు.
ఒక బుడుగు,  ఒక పెసూనాంబ.
రాధాగోపాళం కానరాక, తెలియలేక
తెలుగు వెలుగు లోగిళ్ళే వెలవెలబోయేవి కదా!
తెలుగుతనం ఏమిటో తెలిసేదా మనకు సదా?

'రేఖా సాహిత్యం' ఒకటుందని
బాపుయే చూపాడు.
గీతలతో జీవనగీతలనే రాసాడు.
తెలుగులిపికి సొబగు తీర్చి
అక్షర సౌందర్యం నిలిపాడు.

బొమ్మల అందాలకు సాక్షిగా
హృదయాల వాకిట ముత్యాలముగ్గులు తీర్చి
గోదావరి అందాలకు సెల్యులాయిడ్ బంధాలు వేసి
శుభవేళలన్నిటికీ తన కుంచెల నిధులిచ్చి
'బాపురే' అన్పించిన సచిత్ర, దర్శకుడతగాడు
చిత్రకళా జగతి కొలుచు అందాల రాముడతడు.

తన తపస్సు ఫలించి వెళ్ళిపోయిన బొమ్మర్షి
నిలచి వెలుగు తెలుగునేల
"జయంతి" – "వర్ధంతి" యన
అనునిత్యం అతని కృషి!

# భట్టుమావ పదాలు

టీవి ఛానల్ చూస్తు
ఇంటివంటకు పస్తు
క్యాటరింగ్ నమోస్తు
ఓ భట్టుమావ!

చెరుప యువతల నడత
సినిమాలె తొలివిడత
ఇంటర్‌నెట్ సహజాత
ఓ భట్టుమావ!

మైకు చిక్కినవాడు
మైక మెక్కినవాడు
వడి వడిగ దిగిరాడు
ఓ భట్టుమావ!

భర్త టార్చిలైటు
కొడుకు సెర్చిలైటు
శ్రీమతి నక్సలైటు
ఓ భట్టుమావ!

మనసు హిందూ ఇజము
మాట కమ్యూనిజము
చేత కాంగ్రెస్ ధ్వజము
ఓ భట్టుమావ!

గేమ్‌షోలకు రష్షు
స్నేహాలలో ఖుష్షు

పంపు ఎస్సెమ్మెస్
ఓ భట్టుమావ!

పైట తగలెయ్యాలి
అన్నదొక కవయిత్రి
పాటించి చూపించె వెండితెర అభినేత్రి
ఓ భట్టుమావ!

కొడుకు దింజనీరు
డాక్టరను కూతురు
ఫీజుకట్టగలేక తలిదండ్రిబేజారు
ఓ భట్టుమావ!

తలనిడక హెల్మెట్టు
పోలీసు పనిపట్టు
ఉన్నలేకున్ననూ నరకంపు మెట్టు
ఓ భట్టుమావ!

వలస వలదని నాడు
ప్రతి గమ్యమీనాడు
అమెరికాకే చూడు
ఓ భట్టుమావ!

అగును జీవద్భాష
ఏల ప్రాచీనతా ఘోష
తెలుగు ఉచ్ఛ్వాస నిశ్వాస
ఓ భట్టుమావ!

చలి కొరకు దుప్పట్లు
చవి కొరకు బొబ్బట్లు
కవి కొరకు చప్పట్లు
ఓ భట్టుమావ!

# ప్రణయజలధిలో మోహాకెరటం

ఏకపత్నీవ్రతుడే అయినా
రాముడి జీవితంలో
శూర్పణఖ తటస్థించింది
అన్య స్త్రీ గురించి
ఆయనా ఆలోచించాడు
ఎలా వదిలించుకోవాలా అని

తనను చెరబట్టి తెచ్చిన
రావణుడి గురించి
అనుక్షణం
సీతా తలపోసింది
ఎంత త్వరగా అతని బారినుంచి
రాముడు విడిపించి
తీసుకువెడతాడా అని

భార్యాభర్తలకయినా
పరభావన అనివార్యం

తనవైపు నుండి
అనర్థమనుకున్నదే
ఆవలి మనసుతో చూస్తే
ప్రణయానికి అన్వర్థం
అటు ప్రేమగా ఉండేది
ఇటు కామంగా చూసేది కావచ్చు
కామం అంటే కోరిక!

నువ్వు తప్ప
నా భావనల్లో మరొకరు
లేరనే, రారనే మాట
యథార్థం కాదు
మంచికో చెడుకో
ఎప్పుడో ఒకప్పుడు
ఎవరో ఒకరు ఎంతోకొంత
తలపుల సంచలనమవుతారు
పరాయిని ఏ త్రుటి కాలమో
ప్రణయ జలధి
మోహకెరటంలా
నీ నావవైపు నెట్టుతుంది
తుఫానులు తట్టుకుంటూనే
సముద్ర యానాలు సాగుతాయి
అవి సంసారాలవీ కాక తప్పని
కాలాలు కొత్తవేమీ కావు

ఇంద్రియాలున్నాక
ఇంద్రత్వమూ కమ్ముకోవచ్చు
రసపట్టువేళ
అహల్యయినా తమిలో
కాదని తెలిసినా
గౌతముడినే
ఎదురు(గా) చూస్తూ
భవిత పాషాణమైనా
భరిస్తుంది
రామపాదమూ
పర(మ) పురుష స్పర్శయే!

పంకిలమేదో, పవిత్రమేదో
నిర్ణయించేది ధర్మమే!
ఇంతకూ భార్యను కాక పరస్త్రీని
భర్తను కాక
అన్య పురుషుడిని
ఎపుడో ఒకప్పుడు
ఎందుకో ఒకందుకు
ఎంతో కొంత
తలపుల్లోకి చొరబడకుండా
నిగ్రహించగలగడం
యతులకైనా అసాధ్యం
అని గతగాథలెన్నో చెప్పాయి

ప్రేమించినా, కామించినా
మోహించినా, మరులుగొన్నా
భగ్నమైనా, ఉద్విగ్నమైనా
రోదించినా, సాధించినా
స్నేహించినా
దూషించినా, ద్వేషించినా
అంతరంగ ద్యుతి అనివార్యం
మనోకామనాచ్యుతి అవిభాజ్యం

# అసలుకి

*ప్రతి రాత్రీ కనుమూసి నిద్రిస్తున్నప్పుడు*
*లోపల ఎంత చీకటి పేరుకుంటోందో*
*అనిపిస్తుంది.*
*లేవగానే ఆ చీకటి ఎక్కడెక్కడ సర్దుకుంటుందో!*
*జేబులో ఇంత చీకటేసుకునే–*
*ఎక్కడికి వెళ్ళినా.*
*చీకట్లోనే కాదు–*
*చీకటి మనుషులు ఎప్పుడో అప్పుడు, ఎక్కడో అక్కడ*
*ఎందుకో అందుకు ఎదురవుతూనే వుంటారు.*
*చీకట్లు కరచాలనం చేసుకుంటాయి.*
*పగలబడి నవ్వుకుంటాయి.*
*పనిమాలా కలసి నడుస్తుంటాయి.*

*చీకటంటే చిన్నప్పుడు భయం*
*ఆ భయమే బాగుండేది.*
*రాక్షసులూ, దయ్యాలూ కథల్లో బాగుంటారు.*
*కానీ ఇవాళ సమాజంలో దాగున్నారు.*
*అదీ అసలు భయం!*
*చీకటిని పట్టుకునేవారు, ఆకట్టుకునేవారు ఎక్కువై*
*తిట్టుకునేవారు తక్కువయితే*
*అమావాస్య చంద్రులే అధికారపీఠాలెక్కుతారు*
*తిమిర నరకాసురులవుతారు*
*ఇంతకీ*
*చీకటికి చెల్లుచీటీ రాయాల్సిందేగా!*
*తిమిరంతో సమరం అనివార్యం కాదా?*

చిచ్చుబుడ్లు చిమ్మినా
బాంబులు పేల్చినా
తరతరాల చీకట్ల సంహారానికే అని తెలియాలి.

తప్పక వీరుడు దీపమై వస్తాడు.
సూర్యుడు ఒక దీపం. చంద్రుడు ఒక దీపం.
రోజులన్నీ దీపద్వయ సందీప్తం.

మట్టి ప్రమిదలో స్నేహం పోసి
సదాచరణల వత్తివేసి వెలిగించి
ప్రగతికాంతులు ప్రసరింపచేయడం
సమష్టి కర్తవ్యం

ఇవాళ దీపం విద్యుదీకరణమైంది.
ఎల్.ఇ.డి బల్బులయ్యింది.
ఆర్ద్రత లేనప్పుడు నూనె దీపాలు మాయమై
కొవ్వొత్తుల కొవ్వే పరుచుకుంటుంది.
దీప సంఘాతాల్లో విద్యుదాఘాతాలూ విచ్చుకుంటాయి.
అయినా సరే! చీకటిపై యుద్ధం తప్పదు.
శాంతిస్థాపనం తప్పదు.

'తమసోమా జ్యోతిర్గమయ'
తమలో నుండి చీకట్లను పారద్రోలడానికి
సమాయత్తమైన వారెవ్వరు?
దీపధారులెవ్వరు? దారిదీపాలెవ్వరు?

విస్తరింపు మెట్లెక్కుతూ దీపం
వెలుగుపాట పాడుతుంది దీపం
ఆలోకం లేకుండా ఈలోకం లేనేలేదు

ఇంతకీ
నువ్వు దీపం వెలిగించడం కాదు
నువ్వే దీపం కాగలగాలి.
అప్పుడు నిద్రించిన లోచీకట్ల జలధిలో
ఉదయించిన వెలుగు సూర్యుడు
తిమిరాలను పటాపంచలు చేసి
జ్ఞాన తీరాలను చేరుస్తాడు.

నిన్ను నువ్వు వెలిగించుకుని
నీ వారిని వెలిగించడమే,
వ్యష్టి సమష్టిలో ప్రకాశనం కావడమే
అసలుకి దీపావళి!
అసలైన దీపావళి!

# మౌనమే నీ చప్పుడు

ఎవ్వరూ ఏడ్వవద్దు
తండ్రిపోతే కొడుకుంటాడు
వ్యాపారం ఏమీ ఆగిపోదు
షాపు ఎవరూ ఎత్తేయడం లేదు
ఇంకా హంగులతో ఆర్భాటాలతో
చిల్లరకొట్టునే మెగామాల్‌గా
పెంచేయడానికి వీలుంది

తండ్రి కూలిపోతే
కొడుకు 'కూలీ'కి పోతాడనుకోవద్దు
ఉద్యోగం చేస్తూ చేస్తూ ఊపిరాగిపోతే
ఉన్నవాడికి 'కాంపెన్‌సెషన్' ఇవ్వడం
ఆరిపోకుండా కుటుంబాన్ని ఆదుకోవడమేగా
సామాన్యుడికో రూలూ
సంపన్నుడికో రూలూనా
కష్టం ఎవరిదయినా కష్టమే కదా పాపం
తండ్రిని తనయుడు భర్తీ చేస్తానంటున్నాడు

తండ్రి దేవుడు
కొడుకు దేవుని బిడ్డడు
భక్తితో కొలవడమే జనం పని
వడ్డీకి ఋణాలిచ్చి ఆదుకునేదీ
పెయ్య బాగులేకపోతే మందో మాకో ఇచ్చి
ఆరోగ్యశ్రీలు కురిపించేదీ
చెయ్యీకాలూ ఆడని ముసలితనానికి
సేవచేయలేకపోయినా
వందో రెండొందలో ఇచ్చి

అభయహస్తమయ్యేదీ
పనిచేసే సంస్కృతి పో(గొట్టు)తున్నా
నీకు కష్టం లేకుండా జోకొట్టి
నీ భూములనూ, 'బూమ్'లనూ
తనదిగా ఆదుకుంటున్నదీ
ఏదీ ఆగిపోదు
విశ్వసించినవాడు కదా
ఇంక అంతా విడిచిపెట్టు

నువ్వు ఎంత అజ్ఞానివైతే అంత సుఖం
'ఇగ్నోరెన్స్ ఈజ్ ది బ్లిస్'
నీకు బుద్ధి ఎందుకు? ఇంత బువ్వకావాలి.
మాతృభాషలో విద్య ఎందుకు?
మా ఛానెల్స్ టీవీల్లో వినోదం కావాలి.
వాళ్ళ మేడల సంగతీ, మేడమ్స్ సంగతీ ఎందుకు?
ఇందరికీ ఇళ్ళు వుంటే చాలు.
గుడిసేటి వలసపోని బ్రతుకు చాలదూ!

ఎందుకు ఏడవడం
చివరకు ఎలాగూ అంతాపోయేదే
విమానలోంచి పోతేనేం
వీధి మున్సిపల్ బండిలాగేస్తేనేం
చావు గురించి చచ్చిన చావు
ఆర్భాటాలెందుకు నీకు
చచ్చు గుండెకాకపోతేను.
ఏదీ ఆగిపోదు ఏదీ మారిపోదు
ఎవరు ఏలుబడికి వచ్చినా
ఇంగ్లీషు నీ బడికి వచ్చినా
పావలా వడ్డీ ఇచ్చినా

అందరికీ మూడు పూట్లా ఉచితభోజనం
అని రేపు సరికొత్త పథకమొచ్చినా
నీ బ్రతుకు నీదే
నీ చావు నీదే

దినపత్రికల వార్తలూ
ఇరవై నాలుగ్గంటలూ ఛానెళ్ళ ప్రసారాలూ
కళ్ళల్లో, చెవుల్లో కుక్కుకుని
అధికారం, ధనం, హింస, సెక్సు
కక్కుకుని–
నీ బ్రతుకు నీదే.
నీ చావు నీదే.

ప్రభుత్వమేదయినా నీదే అవుతుందిలే
నీ మీద నీకు ప్రభుత్వం లేనప్పుడు
ఎంత అరచి గీపెట్టినా
మౌనమే నీ చప్పుడు.

# అమ్మ శ్రాద్ధకర్మ

*ఒక్కగా నొక్క కొడుకు*
*తల్లికి శ్రాద్ధం పెట్టడానికి*
*ఇవాళ పరదేశం నుండి వచ్చాడు*

*అమ్మకు ఇష్టమైన పదార్థాలన్నీ వండి*
*సమారాధనకి అందరినీ పిలిచారు*
*అమ్మ పేర పిండం తయారుచేసి*
*కాకిని ఆహ్వానిస్తూ పెట్టి ఉంచారు*
*కానీ ఏమయిందో తెలియదు*
*కనుచూపు మేరలో కాకి జాడయే లేదు*
*కొడుకు హతాశుడయ్యాడు*
*ఎక్కడో ఏదో లోపం జరిగింది*
*కాకి – పిండం ముట్టనిదే కర్మకాండ సంపూర్ణం కాదు.*

*రావమ్మా కాకీ! రా!*
*త్వరగా రా ఓ ప్రియమైన కాకీ!*
*అంతా నీ కోసమే చూస్తున్నది*
*కాళ్ళూ చేతులూ శుభ్రంగా కడుక్కుని తయారై*
*నీ రాక కోసమే నిరీక్షిస్తున్నాం!*
*ఎగిరి రావమ్మా!*
*ఈ పిండాన్ని నువ్వు ముట్టుకో చాలు*
*కుదుటబడతాయి మా మనస్సులు*
*కాకీ! కాకీ! కవ్వల కాకీ!*
*నా చిననాటి నేస్తానివి కదూ!*
*ఎందుకు రాక కోపగిస్తున్నావ్?*
*అలిగి దాగుంటున్నావ్?*

*తన చంకనెత్తుకుని గోరుముద్దలు తినిపిస్తూ*
*ఎన్నోమార్లు అమ్మ నిన్ను పిలిచి నాకు పరిచయం చేసింది*

నీకో ముద్ద నాకో ముద్ద అంటూ
ఇద్దరికీ అన్నం తినిపించింది.
అన్నేళ్ళ మన స్నేహాన్ని మరచి
ఇవాళ నువ్విలా ప్రవర్తించడం భావ్యం కాదు
అమ్మ ఎప్పుడూ నన్ను మరచిపోలేదు
కాకమ్మా! నువ్వే ఎందుకు రావడం లేదు
అమ్మ చివరి చూపులకు నేను రాలేదని
అందరూ నన్ను నిందించి కేకలేశారు
అమ్మ వృద్ధాశ్రమ ఖర్చులను
క్రమం తప్పకుండా నేనే చెల్లించాను
కానీ ఈ నీ నిరాదరణ
నన్ను క్షోభకు గురిచేసి కుదిపివేసింది

ఇప్పుడు అమ్మ ప్రేమ జ్ఞాపకాలతో
నా అంతఃకరణం బరువెక్కిపోయింది
అమ్మ నా కోసం ఇప్పటికీ అన్నివైపులా వెతుక్కుంటోంది
అమ్మకు తోడుగా కాకి రెక్కలల్లార్చుకుపోయింది
నేనే ఇక్కడ
ఈ కాల ప్రవాహంలో పడి కొట్టుకుపోయాను
ఎక్కడో ఎప్పుడో తప్పిపోయాను
నన్ను నేను పోగొట్టుకున్నాను
ప్రేమమయి అమ్మను వెతుక్కోవడంపోయి
శ్రాద్ధకర్మ పూర్తికావాలని కాకి కోసం వెతుక్కుంటున్నాను

అవును నాకు తెలిసి వచ్చింది
అమ్మ అమ్మే!
అమ్మ కాదు పోయింది.
నేనే మారిపోయాను.
తప్పిపోయింది నేనే!
తప్పిపోయింది నేనే!
పోయింది నేనే!

**(కొంకణి మూలం: శ్రీమతి చంద్రికా పడగావ్‌కర్)**

## రాయడం మానేశా!

పైలా పచ్చీసు వయసులో
ముఖవర్చస్సు కని
మబ్బునీటితో
కొండను కడిగినట్లు కడిగి
అద్దంలో ప్రతిబింబం
చూసుకుంటూ
ఇంత పాండ్స్ పౌడర్
రాయడం గుర్తుంది....

రవ్వంత మొటిమ పొటమరిస్తే
ఫెయిర్ అండ్ లవ్లీ
రాసిన గుర్తుంది.
నెత్తివెంట్రుకలు
అణగి ఉండాలని
నిగ నిగల జుట్టు నిగారింపుకోసం
బ్రిల్ క్రీం రాసేసి
తల దువ్వేసి తరుణుల ముందు
తిరుగాడిన తరుణమూ
తలంపులో వుంది.
ఇప్పుడు రాయడం మానేసాను

అరవై ఏళ్ళు పైబడిన
ముఖం ముడుతల్లో
ముఖం కడిగి రాసినా
పౌడర్ రేఖల ఎబ్బెట్టుతనం
తెలిసాక

మొటిమలు కాక
దవడలు పీక్కుపోయే వేళ
ఇంక ఫెయిర్ అండ్ లవ్లీలు
వీకో టర్మరిక్ వానిషింగ్
క్రీములు
రాయడమూ మానేసాను

బట్టతల – మేధావి లక్షణమని
సర్దుకుపోయే వయసొచ్చాక
కొబ్బరినూనే కాదు
తలకు తలంటువేళల
షాంపూలతో సహా
ఏ తలనూనెలూ
రాయడమూ మానేసాను

అప్పట్లో సెంటు రాయడమూ
ఉండేది
బట్టలు సెంటుతో బాటు
పరిమళించేవి
ఇప్పుడు ఆస్త్మా పేషంట్
మా ఆవిడకి
ఆ వాసనే కాదు
తలనొప్పి అని నే రాసుకునే
అమృతాంజనం ఘాటూ
పడదని
సెంట్లే కాదు... ఏ బామ్‌లూ
రాయడం మానేసాను

నడుం నొప్పయినా
మోకాళ్ళ నొప్పులయినా
స్ప్రేలు
వచ్చాక
ఆయింట్‌మెంట్
పై పూతలు రాయడం మానేసాను
అవును రాయడం మానేసాను

కానీ వయసు పెరిగినా...
శక్తి సన్నగిల్లుతున్నా...
ఇప్పటికీ
రాయడం మానేసాను
అని చెప్పనిదొక్కటే
అదే నా కవిత్వం.

నా ముఖ కాంతికీ
నా వసన ప్రకాశానికీ
తలనొప్పులెరుగని
తలపుల తేజానికీ
రాయడం మానేసాను
అని చెప్పని,
ఎప్పటికీ చెప్పలేని
చెప్పదలచని
కవిత్వమే హేతువు

కవిత్వం
రాయడం మానేసాను అంటే
జీవితం జీవించడం
మానేసాను అనే.

# అంటరాని వసంతం

ఒకప్పుడు కొందరు పిల్లలు ఇంటినుంచి
పారిపోయేవారు.
ఏ ప్రవాసంలోనో చిక్కుకుని
అలాంటివారే ఇప్పుడు ఇంటికెలా పారిరావడమని
చూస్తున్నారు.
విద్యపేరునో, ఉద్యోగం పేరునో
విదేశాలలో వున్న తమవారి కోసం
దేశీయ హృదయం తల్లడిల్లుతోంది నేడు.

మగవాడు తిరగకా ఆడది తిరిగీ చెడుతారని
ఒకప్పటి సామెత
ఇప్పుడు అనవసరంగా వీధినబడ్డ
వారెవరైనా చెడ్డవారే

కరచాలనమే
కరోనా కరవాల చాలనమై
కడతేర్చవచ్చు
ఆలింగనమే ధృతరాష్ట్ర కౌగిలిలా
ఉక్కుమనిషినైనా ఉసురు తీయవచ్చు
పొడిదగ్గే పొడిచేయవచ్చు
జ్వరమే జరామరణం కావచ్చు
అది కనబడని శత్రువు
ఇప్పుడు చేయాల్సింది క్రిమి సంహారక క్రతువు

ఇపుడు
ఎడమే ఎవరికైనా ఏలుగడ

ఏకాంతమే శ్రీరామరక్ష
భౌతికదూరమే బ్రతుకు భరోసా
శత్రుసంహారానికి చేతులు కడుక్కోండి చాలు
గడపదాటి పోకున్న వేళలే కవచాలు
నేటి అంటరాని వసంతమే  అసలైన ఆమని

ఉర్విపై ఈ శార్వరిలో కరోనాను కడతేర్చి
మనలను మనం రక్షించుకుందాం
మానవుని విజయపతాకను
మరలమరల ప్రపంచమంతా ఎగరేద్దాం

## తాక(రా)ని సందేశం

*ఇప్పుడెవరికీ...*
*'బి పాజిటివ్' అని సందేశించలేను*
*'నెగిటివ్'లోనే అసలంతా నిబిడీకృతమై ఉండటం తెలీదా!*
*డార్క్‌రూమ్‌లో నెగిటివ్‌ను కడిగినపుడే*
*అందమైన ఫోటోలు వచ్చే కాలమే బాగుండేది మరి!*

*నీడలే నయం*
*చెట్టుది చల్లదనం ఇస్తే... తనది తనకు తోడన్నట్లుంటుంది.*
*ఇప్పుడు... 'నేలతో నీడ అన్నది–*
*నను తాకరాదని'!*
*అందుకనే వీధిలోకి వెళ్ళకూడదు ఎవరమూ!*
*ఇంటిపట్టున కుటుంబపు చల్లని నీడలోనే ఉనికి.*
*పరుగుల జీవితానికి ఈ నిర్బంధపు కళ్ళెం*
*మానవీయతకు పట్టే హారతి పళ్ళెం.*
*కాలు గడపదాటకుండా*
*పాలు, కూరలు, నిత్యావసర సరుకులు*
*రాజసంగా అందుకున్న కాలం అయితేనేం*
*ఏమొచ్చింది కష్టం? నీకేం రోగం?*
*ఇంటిపట్టున ఉండక రోడ్లమ్మట బలాదూర్ తిరిగేందుకు*

*సఫాయివాలా, ఆస్పత్రి నర్సూ, డాక్టరూ, రక్షకభటుడూ*
*తమ ప్రాణాలను పణంపెట్టి*
*ఈ కష్టకాలంలో నిస్వార్థ సేవచేస్తున్నారు.*
*వారి శ్రమను గుర్తించైనా*
*నువ్వు ఇంటనే సురక్షితంగా విశ్రమించు*

*ఇది నిన్నటిదాకా నువ్వేగబడిన చైనా బజారుసరుకు కాదు*
*అక్కడినుండి ఉత్పత్తిచెందిన ఉత్పాతం*

దానికి అంటరానివారెవరూ లేరు
అందుకే దిగబడుతోంది అంతటా!
అంతర్జాతీయ విస్తరణతో అది 'ప్రపంచీకరోనా'యే!

కరోనాను కట్టడి చేయడం ఎలాగో తెలీక తలలు పట్టుకుని
కాళ్ళూ చేతులూ ఆడటం లేని స్థితిలో
కాలు కదపకపోవడమే కాగల కార్యం!
చేతులు శుభ్రం చేసుకుంటూండటమే చేయగల్గిన చేత!
భౌతికదూరం పాటించడమే నేటి సార్వభౌమత్వం
పురుగును చూసినట్టు తేలికగా చూస్తే
అగ్రరాజ్యాన్నయినా క్రిమియే కబళిస్తుంది
చెయ్యి చాచి కలపడం కాదు
చేతులు ముడిచి నమస్కరించడమే మనస్కరిస్తుంది దానికి

ఇప్పుడు క్రిమిసంహారమే అందరి ముందున్న యుద్ధ క్రతువు
ఏకాంతమే ఎదురులేని ఆయుధం
స్వీయనియంత్రణమే సురక్షా పథకం.
ఇల్లే ఈ 'యిల్'(రోగా)న్ని
అంతమొందించగల రణవ్యూహం
నువ్వు చప్పట్లు కొట్టినా, దీపం పెట్టినా
అది శత్రువుపై రణదుందుభి మ్రోగించే
విజయ శంఖారావమే!
ఇప్పుడు 'నెగెటివ్'యే అసలు
బ్రతుకుకు పాజిటివ్ భావన సుమా!

జాగ్రత్త పడటం కర్తవ్యం
సమష్టి దీక్షయే కర్తవ్యం
కరోనాను కట్టడిచేసి కడతేర్చి
భావి జీవనానందం  పొందడమే ప్రపంచ మానవాళికి
ఇక అవశ్యమనుభోక్తవ్యం!
ఈ సందేశమే సవ్యం! దివ్యం!

# విజేతలై నిలుద్దాం

*ఇపుడు గణిస్తున్నవీ, పరిగణిస్తున్నవీ*
*రోజువారీగా*
*నమోదవుతున్న కొత్త కేసుల సంఖ్యలు*
*పాజిటివ్‌ల అంకెలు – మరణాల మొత్తాలు*
*అంతా అంతటా అంకెలే అంకెలు*

*అంకెలు భయపెడుతుంటే*
*ఆదుకోవాల్సినవి అక్షరాలే మరి!*
*మంచిమాటలే మందు బిళ్ళలు*
*ప్రజలనుద్దేశించి ప్రధానియో*
*తెలంగాణ కరుణామయుడు కేసీఆరో*
*ప్రసంగిస్తున్నప్పుడు*
*మాటే మంత్రంలా*
*ఒక భరోసా పరుచుకుంటుంది*

*కర్తవ్య ప్రబోధంతో*
*కట్టుబడి బతుకు నెట్టుకు రాగలమనిపిస్తుంది*
*ఇంటి బాల్కనీలోంచి*
*వీధిలోకి తొంగి చూసినపుడు*
*కనిపించే సఫాయి కార్మికుడూ,*
*పోలీసు ఉద్యోగీ*
*దృశ్య మాధ్యమంలో ధైర్యం చెప్పే డాక్టరూ*
*అందరూ శతకోటి వందనీయులే కనుక*
*చేయెత్తి దండం పెట్టాలనిపిస్తుంది*

ఇల్లు కదలకుండానే నిత్యావసరాలు
నిరాటంకంగా సాగిపోతున్నప్పుడు
కడుక్కుంటున్న చేతులే రక్షణ కవచాలుగా
భౌతిక దూరమే బ్రహ్మాస్త్ర శస్త్రాలుగా
కనబడని శత్రువు మీద
ప్రతి ఒక్కరూ ఒక సుశిక్షిత సైనికునిగా
కాలం కదం తొక్కుతున్నప్పుడు

ఆత్మీయుల, బంధువుల, అయినవాళ్ళ
ఫోన్ పలకరింపులూ, వాట్సప్ స్టేటస్‌లూ,
వీడియో కాన్ఫెరెన్స్‌లూ
బతుకు మీద కాన్ఫిడెన్స్‌ను పెంచుతూనే వుంటాయి
ఇల్లే ఒక గుడిగా, ఏకాంతమే ఏకేశ్వరోపాసనగా
శుచీ, శుభ్రతలే పూజాపునస్కారాలుగా
దేహమే దేవాలయమున్నట్లు సంచరిస్తున్నప్పుడు
భయం దేనికి

బతికుంటే బలుసాకు తిని బతకవచ్చున్నట్లు
ఈ నిర్బంధం కొనసాగినా
కరోనాను కడతేర్చడమే అందరిముందున్న కర్తవ్యం
అందుకు ఒక్కొక్కరూ ఒక్కో సైనికుడే.
క్రిమిసంహారమే నేటి కురుక్షేత్రం
అగ్రరాజ్యమైనా, అధోజగత్సహోదర దేశమైనా
వణికిస్తున్న కరోనా పీచమణచడమే
ప్రజావళి క్రమక్రమానుగత
చైతన్య ధనుష్ప్రాణులు కావడమే
అదే మన తక్షణ కర్తవ్యం

అంకెలకు భయపడక, అక్షరాలా దీక్షాదక్షతలతో
మానవతా విజయకేతనం ఎగురవేద్దాం

సుధాము

ఇప్పటి ఈ ఉత్పాత చరిత్రకు మంగళాంతపు తెరతీసి
ప్రతి మనిషినీ రక్షించుకుందాం
మానవుడే మహనీయుడని నిరూపిస్తూ
కరోనాకు మరణశాసనం రాద్దాం
మనిషి మనిషిగా
దైవం మానుషరూపేణ అనేదే నిర్ధారిద్దాం
లోకాస్సమస్తా సుఖినోభవంతు అని నినదిద్దాం
విజేతలై నిలుద్దాం.

# కూరలబ్బాయ్

ముదరని 'బెండకాయ' లాంటి
'టమాటా' పండులా వుండే
మా కూరలబ్బాయి...
'చుక్క(కూర'లా) పొడిచేవరకూ,
'తోటకూర' కాడలా వాలిపోతున్నా
మీసాలపై 'నిమ్మకాయ'లు నిలిపే ధైర్యంతో
'క్యాబే(అన్నా,)జీ' అంటూ
సూర్యుడు 'కంద' గడ్డలా వున్నా
వేసవి ఎండకు అంగీ 'ముల్లంగి' లా చికాకుగా వున్నా
తల్లి చేయని మేలు చేసే 'ఉల్లి' లా
'క్యా రేట్' అని ఎవరు విస్తుపోకుండా,
అమ్మకాలు సాగిస్తూనే వుంటాడు.

మా 'పొట్ల'లో.. కాయగూరల
బలిమినిచ్చే తానే మా చెలిమి
ఇంకా'కొత్తి మీర' గల అనుమానం లేక
అతని 'ఆలూ' ఇంట్లో ఎదురుచూస్తూంటుంది.
అతన్ని ఎవరూ 'మునగ' చెట్టెక్కించక్కర్లేదు
తన 'తోట కూ ర'గడ ఏమీ జరగక
రే'పు దీనా'వస్థలో పడకుండా
'కాలీఫ్లవర్' కరోనా లా కనిపిస్తున్నా
అతని వ్యాపారం నిర్భీతిగా సాగితే చాలు.

సుధాము

అతని ఉనికే నిత్యం మా వంటింటికి మనికి
అతని సేవలు కొనలేం 'మనీ'కి
అవసరం తీరాక మరి'చేమ' – అనికాక
'కరివేప'లా తీసి పారేయకుంటే చాలుకదా!

కూరలవాడా! కూరిమిరేడా!
నీకూ, నీ సేవలకూ ధన్యవాదాలు
నీ సాయాన కరోనా ను కావిస్తాం
ఖాళీ బుట్ట దాఖలు.

# వీధి బడి

వీధి బడిలో
పోలీసు పంతుళ్ళు
గుంజీలు తీయిస్తున్నారు
బెత్తంతో చావబాదుతున్నారు.
కొత్త కొత్త శిక్షలను
కఠినంగా అమలుచేస్తున్నారు

ఇంతకీ నేరమేమిటో
తెలుసా !
రావద్దని సెలవులిచ్చినా
వీధిబడి బాట పట్టడమే

ఇంటిపట్టునే వుంటే
పరీక్ష రాయకపోయినా
పై తరగతికి విద్యార్థి వెళ్లే
వెసులుబాటు కూర్చినా
పిల్లచేష్టలతో రోడ్డెక్కడం
కొందరు పెద్దలకే
ప్రమాద హేతువు.

వీధి బడికి వెళ్ళవద్దు.
అమ్మ లాంటి ఇల్లే
ఇప్పుడు అన్నీను.
భోజన పథకాలైనా,
ఆటపాట తరగతులైనా,
అన్నీ–
గడపదాటకుండానే –

వీధి బడులు
ఇప్పుడు
పోలీసు పంతుళ్ళవి
వాటి శుభ్రత పని
పారిశుద్ధ్య కార్మికులది
మనిషి రోడ్డున పడితే
ఇప్పుడు
క్రిమి కబళిస్తుందనేదే
ప్రాథమిక విద్య.
పలక లేక
భౌతిక దూరం పాటించడమే
మౌలిక జ్ఞానం.
ఆరోగ్యం వీధిపాలు కాకూడదు.
కవి భిషక్కు వైద్యుడే
ప్రాణాల పాఠాలు బోధిస్తాడు.

ఇపుడు అందరికీ
పరీక్షా సమయమే
బడిలో మ్రోగుతున్నవి
మృత్యుఘంటికలు
అందుకే
స్వీయ గృహ నిర్బంధమే సరియైన సమాధానం
కరోనా కట్టడియే
అసలైన పట్టభద్రత
వీధిబడి పాలుకానివాడే
విశ్వవిజేత.

# ప్రతిఒకడూ ఒక జవాన్

*చప్పట్లు కొడితే స్వాగతమనుకున్నట్టుంది*
*దీపాలు వెలిగిస్తే*
*చీకట్లోంచి రావడానికి దారి చూపారనుకున్నట్టుంది*
*డ్రాగన్ దాడిలా, చైనా బజారు సరుకులా*
*విజృంభించింది.*
*నిజమే! మనది స్వేచ్ఛా భారతమే!*
*కానీ విదేశాల నుండి స్వేచ్ఛగా దిగుమతికి సహిష్ణులం కాదు.*
*వర్ధిష్ణు దేశమేకానీ –*
*అనర్థాలకు ఆలవాలం కాలేము.*
*'ఎదుర్కోల' అంటే ఇక్కడ వివాహ ఆహ్వానం కాదు*
*ఎదురుదాడియే!*
*చైనా అయినా, ఎక్కడ నుంచైనా రానీయ్!*
*యుద్ధం చేయడమే కర్తవ్యంగా అడుగేయ్!!*
*రోజువారీ లెక్కల్లో సంఖ్య దినదిన ప్రవర్థమానమవుతున్నా*
*ఎదురొడ్డి నిలిచి, గెలిచి స్వస్థతపొందిన సంఖ్యా అధిగమిస్తోంది.*

*భయపడద్దు. బలహీనమవ్వద్దు.*
*ధైర్యమే కాపాడే కవచం!*
*ప్రపంచానికే శుచీ, శుభ్రత నేర్పగల దేశం మనది.*
*జాగరూకతల ఆదేశం త్రికరణ శుద్ధిగా ఔదల దాలిస్తే–*
*త్రివర్ణ స్వేచ్ఛా పతాకానికి అవనతం మాటే లేదు, రాదు!*

*ఔను! పరీక్షాకాలమే*
*రాయకుండానే పాసయ్యే కాలమే కావచ్చు*

కానీ కర్తవ్యం నుంచి విముఖులెవరూ కాదు
ఇల్లే పోరాటక్షేత్రం
ఒంటరితనమే ఏకవీరత్వం
హస్తచాలనాలు కాక భౌతికదూరం నుంచే
మనఃపూర్వక మన్ననలూ
మాస్కుల నుంచే మందిర నిర్మాణ విన్నాణాలూ
కుదించుకున్న అనవసర ప్రయాణాలూ
ఆర్భాటం లేని పరిణయాలూ
ఆర్తులను ఆదుకునే సోనూసూద్‌ల ఆదరణీయాలూ
హరినారాయణులుగా ఆరోగ్య వరాలిచ్చే
వైద్యుల అపర ధన్వంతరీయాలూ
క్రిమిలేయర్స్ ఏర్పడకుండా వీధులను పరిశుభ్రంచేసే
పారిశుధ్య కార్మిక పవిత్ర కరచరణాలూ
కార్పొరేట్ల ధనదాహాలను కట్టడిచేసే పాలనాధికరణలూ
నిత్యావసరాలకు విఘాతం కలగని పరిక్రమణలూ
ఔను!
దేశమేం గొడ్డు పోలేదు.
కరోనా మనప్రగతికి అడ్డుకాలేదు

ప్రాణాలను పణంగాపెట్టే వీరులున్న దేశం ఇది
ప్రతిఘటించి శత్రువుపై పోరాడగల పటిమ మనది
శత్రువు - కయ్యానికి కాలుదువ్వే పొరుగుదేశమే కావచ్చు
కంటికి కనబడని కరోనా వైరస్సే కావచ్చు
విజేతలం మనమే!
భవిష్య జగజ్జేతలం మనమే!
మందుగుండు దట్టించి ఆయుధం పేల్చినా
మందు కనిపెట్టి కోవిడ్‌ను కడతేర్చినా

మనది మహాన్ భారత్ యే సదా
పంచిపెట్టగలం మనమే సుధ

అమృతం కురిసిన రాత్రి స్వేచ్ఛా స్వాతంత్ర్యాల భరత ధాత్రి
కరోనా కాలమని డరోనా నహీ
రోనా నహీ రుక్‌జానా నహీ
జైహింద్ బోల్‌నాహీ సహీ!
అనవరత వికాస భారత మీ మహి!–
జూమ్మని మాటే మంత్రిస్తూ–
అదే... అదే... ఎలుగెత్తి చాటే కవితా భారతమిది.

కరోనా విముక్త స్వాతంత్ర్య పోరాటపు నేటి
మాతృభారతికి అక్షరవందనశతమిది
ఇవాళ
కరోనాను కడతేర్చగ ఎవడికి వాడే ఒక జవాన్
మేరా భారత్ మహాన్!
మేరా భారత్ మహాన్.

# ఇలా ఉండిపోనీ

ఇప్పుడిక కవిత్వం కోసం
ఒక రాత్రి నిద్రలో పలవరిస్తున్నాను
ప్రయాణించినదంతా దాని ఒక
ఉత్తరాంచల పార్శ్వపు
శిఖరాలూ... లోయల్లోనే...!
అయినా ఇక్కడో అక్కడో
ఎక్కడో
జార విడుచుకున్నదో
జాడ మరచుకున్నదో

మడిబట్ట టిష్యూ పేపర్‌లో సంగమించినట్లు
తుడిచి పారేసేవే ఎక్కువ
మెడిటేరియన్, మెక్సికన్, థాయ్
ఏదైతేనేం
ప్యూర్ వెజిటేరియన్ కోసం వెంపర్లాట
అచ్చమైన కవిత్వం కోసం లాగానే!

సద్దుకోవడాలూ, సరిపుచ్చుకోవడాలూ
బ్రతుకులోనేనా
ఇప్పుడిక కవిత్వంలోనున్నూ.
కళ్ళముందే డాలర్ మాయలా
డాబుసరి కవులూ తారాట్లాడుతున్నారు.
రాత్రిపూట
లాస్ వెగాస్ నగరంలా మెరిసిపోతున్నారు.
ఆడుతున్నదీ, ఆడిస్తున్నదీ కనబడుతూనే వుంది

ఎంత ఎంత సంచారం చేసినా
అనుభూతి గుండెల్లోదే కదా!
తిప్పేవాడెవడయినా తిరిగేది నువ్వేకదా!
విస్తారపు కవిత్వం
ఒక చిన్నబాటసారి పాదముద్ర పాదరసం నుంచి
జారివస్తుంది.
గ్రాండ్ కానియనో, స్మోకీ పర్వతమో
ప్రకృతి పరవశపు అంతర్జ్వలనమే
డిస్నీ వరల్డ్ ముందు పసిపాపై కేరింతలిడుతుంది.

కా అన్నా కీ అన్నా తప్పనిపిస్తోంది అంటే
కవిత్వాన్ని
నీకోసం నువ్వెక్కడ నిలబెట్టుకున్నావన్నదే
భూసార పరీక్ష
బ్రహ్మాండాల ముందు పిపీలికం అని
తెలుసుకున్నాక
ఇక తెల్లవారిపోనీయ్!

కవిత్వం @జీవితమా?
జీవితం @కవిత్వమా?
ఇక ఆవలించి కావలించి
నిద్ర ఆపుకోకు
నిర్నిద్రత దోపుకోకు

ఇప్పుడిక
కవిత్వంకోసం జెట్ లాగ్
లాగిన్...!
విహాయసం లోంచి అంతఃకరణంలోకి
తెలివి తెల్లారినట్లే వుంది
ఇలా వుండిపోనీ....!

(ఓ వృథా మధ్యాహ్నం)

# వలస వాసోత్తర కవితలు

మేం జలదేవతా రక్షకులం
నదీలోతుల నుంచి పయనించి
ఎప్పుడు ఒడ్డుకు చేరుకున్నామో
అప్పుడే కనికరం లేని వర్తకుల ఆఖరి ఓడ
నది నిక్షేపాల బరువునంతా దింపుకుని
చీకటిని చీల్చుకుంటూ
తెరచాప ఎత్తి వెళ్ళిపోయింది.

ఏళ్ళుగా
చిక్కబడుతూ పెరిగిన రక్తపు జిడ్డుమరకల్లా
ఇసుకకు అంటుకుపోయిన
గడ్డకట్టిన ఎండిన రక్తపు గుర్తుల నుంచి
నదీజలం ప్రవహిస్తూ పోయింది.
జలదేవత
సజీవస్త్రీగా రూపుదాల్చింది.
మాకూ, దోచుకోబడిన మా దైన్య జనానికీ
జలదేవత చెప్పింది–
ఇన్నాళ్ళుగా మేం మౌనంగా ఉన్నాం.
ఎంతోకాలంగా న్యాయం దక్కని బాధతో
బాధలకే మౌనసాక్షిగా ఉన్నాం.
కానీ
ఈరోజు మాకు తిరిగి లభించింది.
మా భాష, మా సంవేదన, మా బుద్ధీ, మా శక్తీ
మా అంతశ్చేతన మాకు తిరిగి లభించింది.
మేం జలదేవతా రక్షకులం.

జలదేవతాదేశ జాగృత పరిరక్షకులం
ఇప్పుడు చరిత్ర మా పక్షం

(2)

ఒక రోజు ఉదయాన్నే
పురాతన కాలం నాటి చెట్టుమీది
ముసలి పిశాచం
బురద మడుగు మధ్యలోని
తామర పువ్వు పక్కగా నిలబడివుంది
వరిమొక్కల విశాలమైదానం లోకి
దాని ఏకాంత మానసం
గాలిలో విహరిస్తోంది.
అప్పుడే వరిచేలలోంచి యుద్ధాశ్వాల
భయంకరమైన సకిలింపు వచ్చింది.
అశ్వారూఢ సైనికుల విజయధ్వని సంగీతం
వినవచ్చింది.
మరణిస్తున్న వృద్ధుడి చివరి ఏడుపు వినబడింది.
మనుషులను క్షామం పట్టుకుంది.
ఆకలితో అలమటిస్తూ అలమటిస్తూ
జనం మృత్యుముఖులయ్యారు.

మనుషులు మనుషుల్లా లేరు
మనుషులు అమానుషులయ్యారు
రోజులు గతించి గతించి
విస్మృతిలోకి వెళ్ళాయి.

రాత్రిళ్ళు గడిచి గడిచి గతమయ్యాయి.
ప్రాచీన వృక్షపు వృద్ధ పిశాచి మనస్సు
మళ్ళీ వరిమొక్కల చేను వైశాల్యంలో ఎగిరింది.
ఒకరోజు సాయంకాలం

అపరసంధ్యలో
గ్రామంలోని వృద్ధులు, పెద్దలు
ఖాళీ అయిపోయిన వరిపొలం మైదానంలో
వృద్ధపిశాచి జీవంలేని శవాన్ని చూశారు.
సమీపంలోనే మనుషుల పాదముద్రలు
వారి గుర్రాల డెక్కల గుర్తులున్నాయి.

(3)

నీలి పర్వతాల మీద పక్షులు రోదిస్తున్నప్పుడు
వరిచేలు బొట్టు బొట్టుగా
పచ్చిరక్తంలో తడిసింది.
కొండలూ, వాటికోనలూ, పక్షులూ భోరున ఏడ్చాయి.
వివర్ణమైన రక్తంతో జనం గుండెలు పగిలాయి.
అడవిలో
చెదపురుగులు భీకరంగా పాడుతున్నరోజు
ఆ పాట అరుపులో ఎగువ ప్రవాహగతిలో
వర్తకుల నావలొచ్చాయి.
చిన్న చిన్న పడవలు, క్షతగాత్రులైన పడవవాళ్ళూ
అంతా మునిగిపోయారు.
అన్ని పడవలూ, ఆ నదీ, ఆ రక్తమూ, మనుషులూ సమస్తం
లోతుగా మునిగిపోయాయి.
భయవిహ్వాలురైన పేదదేశ ప్రజలు
నోటమాటరాక తమ ధైర్యాన్ని కోల్పోయారు.

అప్పుడు మొదలయ్యింది
శాశ్వత వివక్ష రాత్రి.
నలుపు తెలుపుల వర్ణాధిక్యతా పోరాటం.
యుద్ధం చివరిరోజు
దాహం దాహం దాహం దాహం అని
కాకులు రొప్పాయి.

నెట్టారు నెట్టారు నాజీలను అశ్వారోహకులు
నల్లని ఇనుపగొలుసుల ఒక కొసకు.
ఆ బరువు గొలుసుల మరో కొస
దేవతాగుర్రాల డెక్కలకు కట్టేయబడింది.
జనం మృత్యువు ముందు దేకుతున్నారు.
బ్రతుకు బురదలో దేకుతున్నారు వేళ్ళూనుతూ.
మహిమగల దెయ్యాల పరివేషంలోకి
రూపాంతరం చెందుతున్నారు
మెడచుట్టూ గొలుసులతో,
బానిసత్వంలో బతుకుతూ మహిమగలదయ్యాలు.

(4)

ఫాల్గుణ మాసపు పెనుగాలి తెర
వీధిలోని దుమ్మునూ, పొలాల్లోని పాతచెత్తనూ
ఊడ్చి ఎగురగొడుతూ వచ్చింది.
కానీ పాత చెఱువు ఒడ్డున
ఆ కఛారీ జాతి ముసలివాడు
ఎడతెగని ఆలోచనల్లో మునిగి
గత జ్ఞాపకాలతో ఏకాంతంగా కూర్చునివున్నాడు.

ఎప్పుడో నశ్వరమైన ఆ బ్రతుకుల గురించీ
ఎన్నడో నశించిపోయిన ఆ కాలం గురించీ
మేమూ చదువుతున్నాం
మననం చేస్తున్నాం.
అందుకే మేం అడిగాం మా ముసలాయన్ని
జీవితం ఏమిటి?
పెండలం ఆకు మీది లిప్తలో జారిపోయే నీరు
చరిత్ర ఏమిటి?
కలవారల కీర్తిమంతుల కథలు చరిత్ర.
తెచ్చి అమ్ముకున్న దేశాల ప్రజల లెక్కలు చరిత్ర.
ఒకరి సొంతంకాని ఆలోచనలు, హృదయాలు చరిత్ర

తీసుకొచ్చి విక్రయించడానికి వృథా అయిన
చిరుదారులు చరిత్ర.
మేం మళ్ళీ అడిగాం అతనిని
'మనమెవరం' అని
తెల్లటి పాదాల అడుగున పడినలిగిన పెండలం ఆకులం.
అశ్వారోహకుల గుర్రాల కాలిడెక్కల కింద చిప్పిల్లిన బురదనీళ్ళం.
తుపాకీగుండు చప్పుడుకి
బెదిరివణికే భీతాత్మలం

అయితే నువ్వెవరు?
మేము మా కఛారీ వృద్ధుడిని మళ్ళీ అడిగాం

నేను చరిత్రను
గతించిన రెండు శతాబ్దాల చరిత్రను
వలసవాస కాలం కోల్పోయిన శతాబ్దాల చరిత్రను
వలసస్థిరమైన జనం కోల్పోయిన
శతాబ్దాల చరిత్రను
నేను చరిత్రను.

(అస్సామీ మూలం : శ్రీ కమల్‌కుమార్ తంతి)

# ఈ దారి

లెక్కలేనన్ని ఇరుకుసందులు
ఎన్నో ఒకటిగా కలిసిపోయినప్పుడు
అతికష్టం మీద ఏర్పడుతుంది
ఒకదారి!

నిరంతరం నడుస్తూంటుంది
లోపలా–బయటా
బయటా–లోపలా
ఈదారి

ఏ దారెటు పోతుందో
ఎవరికీ తెలియదు
ప్రతి ఒక్క మలుపులో
దాగుంటుంది ఏదో ఒక చిరునామా
కానీ
అడుగులకు చదవడం రాదు

ఒక్కోసారి అమాయకంగా సాదాసీదాగా
ఒక్కోసారి ఎంతో చిలిపిగా కొంటెగా
జ్వలించే వేడిలా ఒక్కోసారి
పరుస్తున్న గుల్‌మొహర్ నీడలా ఒక్కోసారి
కనబడుతూ
ఎంతగొప్ప ప్రయాణీకుడినైనా తికమకపెడుతుంది
ఈ దారి!

కొన్నిసార్లు
ద్వీపవాసిలాంటి యాత్రికుడిని ఆవరించి
నీటిలా చుట్టుముడుతుంది
ఈ దారి!
దారీతెన్నూ తెలియని స్థితిలోనూ
చేతిలో దిక్సూచిపటం పట్టుకున్నట్లుగానే
గమనం సాగుతూంటుంది!

ఎక్కడ మొదలయ్యిందో?
ఎటుపోతుందో?
ఎడతెగని సమూహాలతో
నిరంతరం పరుగిడుతూనే వుంటుంది
అకారణంగా.
బాగుందనిపించిన చోట ఎక్కడో
ఆగి కూర్చుండిపోతుంది కూడా
ఈ దారి!

ఈ దారి నుంచే ఏర్పడతాయి ఎన్నో దారులు!
అనేక రంగులతో-రూపులతో
ఏ దారి ఎవరిని నిర్లక్ష్యం చేస్తుందో
లేదా ఎవరిని సరియైన దారికి తెస్తుందో చెప్పలేం

ఏదో ఓ పేరు కలిగే వుంటుంది అది
శ్రీఫలాల వేడుక పరుచుకునీ వుండచ్చు!
అయినా-
దారి ఏదయినా కేవలం ఒక దారి మాత్రమే!

భద్రపరచబడిన దానిలోని తేమ వల్ల
ఒక్కోసారి దారికి ఏ మూలో
పచ్చనిగడ్డి మొలుస్తుంది!

*ఈ దారి సాగుతూనే ఉంటుంది*
*లోపలా – బయటా*
*వెనకా – ముందూ*
*సమాంతరంగా...!*

*మట్టి నుంచి మట్టిదాకా*
*అంతే,*
*ఈ దారి!*

(గుజరాతీ మూలం : శ్రీమతి ఛాయా త్రివేది)

# మానవ వృక్షం

*చెట్లు నాటడం గురించి మాటాడుతున్నప్పుడు*
*ఒక చెట్టునాటడం మంచిదే*
*అది ముఖ్యమే!*
*కానీ అంతకన్నా ముందు*
*అసలు ఒక మనిషిని నాటండి.*

*ఈ దేశంలో*
*చెట్లే కాదు*
*ఇప్పటికే ఎందరో మనుషులూ నరికివేయబడ్డారు*
*స్వాతంత్ర్య సంగ్రామంలో బలి అయ్యారు కొందరు.*
*కొందరు మతవిద్వేషానికీ, కులజాడ్యానికీ*
*కోతకు గురి అయ్యారు*
*దేశ సమగ్రత కోసం ప్రాంతీయ వితర్దికలపై*
*కొందరు విగతమయ్యారు*
*ధూర్త నయవంచకులతో నిష్కారణంగా కూల్చివేయబడి*
*ఎందరో నిరపరాధులను కోల్పోయాం*
*కొందరు మనుషులు*
*పోలీసు తూటాలకు గురిపెట్టబడి హతులయ్యారు*
*అప్పులభారాన్ని భరించలేని ఋణగ్రస్తులు*
*ఊరి జనాభా తగ్గిస్తూ*
*ఉరేసుకుని ఉసుర్లు తీసుకున్నారు*

*జనాభా పెరుగుదల ప్రమాదమే*
*కానీ*
*ఎంత జనాభా పెరిగినా*

అసలు మనిషి లేకపోతే
ఈ దేశాన్ని రక్షించేదెవరు

అందుకే అంటున్నాను
చెట్టుతోబాటు చెట్టుపక్కనే
మనిషిని నాటండి

మానవత్వం చిగురించి
శోఖోపశాఖలుగా విస్తరించేలా
చెట్టంత ఎదిగేలా మనిషిమొక్కని నాటండి
మనిషిని నాటండి.

(మరాఠీ మూలం : డా॥శ్రీమతి శోభారోకడే)

# దగ్గరగా...రా!

ఎంతెంత దూరం
ఎవరెవరు దూరం
దిగబెట్టేసుకుంటున్నదేమిటి
దిగవేసుకుంటున్నదేమిటి

భౌతికతకూ ఆంతరికతకూ దూరమే
భౌతికంలోనూ దూరం ఉంది
ఆంతరికంలోనూ ఓ దూరం దూరింది.

కడుక్కోవాల్సిందే!
కరచరణాలే కాదు
కర్మపరిపాకాలున్నూ.
ఎంతెంత ఎడమైతే అంతమంచిది
లౌకిక లౌల్యాల బంధాలకు.

నాదినాది అనుకున్నదీ,
నావారు అనుకున్నదీ
అలాగే అటుగానూ అంటిపెట్టుకు ఉంటాయన్నది
ఆత్మతృప్తి నాటకం
సంసార జంజాట బూటకం
అని తెలిసీ–
సామీప్యతకోసం సంతత సంతాప సంరంభంలోనే
చెమ్మగిల్లే బ్రతుకునేత్రం
ఆంతర్యంలోకి దృష్టిసారించదు.
అక్కడున్న అహంబ్రహ్మాస్మిని వీక్షించదు.

సర్వవ్యాప్తి – స్వయంగా
నీలోని నువ్వే అని తెలిసినా
దూరం పెడుతూంటావు.

వేదాంతం ఆత్మను చావుకు దారితీయించడం కాదు
తాత్త్వికతను తడమలేక
భ్రమావరణ ప్రపంచంలోనే
ఒక ప్రాపంచిక జంజాటక్రిమి దాడిచేస్తున్నా
కిమ్మనలేని కాలగతులవెంట
గంతులేస్తూంటాం
దగ్గర చేసుకోవాల్సినది దూరం చేసుకుంటూ
దూరాభారాలనూ దుఃఖపర్యంతసారాలనూ
సమాలింగనం చేసుకుంటూంటాం.

ఎప్పుడయినా ఒక్కక్షణం
ఇంత మౌనానికీ, ఇంత ధ్యానానికీ చోటిచ్చి
అంతరాంతరాల్లోకి రానిచ్చి
నిన్ను నువ్వు పలకరించావా
తనలో తానైనట్లుగా రమించావా
చిరదీక్షా తపస్సమీక్షణలో
చిద్రూప నామస్మరణం చేశావా
నిన్ను నువ్వు గొంతెత్తి పిలిచావా
ఆత్మపరిష్వంగం చేశావా

ఎందుకు బుకాయింపులు
ప్రపంచాన్ని సముద్ధరిస్తున్నట్లు
కాలాన్ని జయిస్తున్నట్లు
ఏం చూసుకు గర్విస్తామని

విశాల బాహిర ప్రపంచమంతా
భయోత్పాత భరితమైనప్పుడు
ఆంతర్యంలో నీకు నీవు చేరువకాలేక
నిన్ను నువ్వే దూరంచేసుకుంటే
స్వయంకృతాపరాధాలకు
ఎవరు నీకు రక్ష?

తాతతాతలు తరతరాలుగా తరలిపోతున్నా
త్రాత తనంత తానై
నీవుగా నీలోనే ఉన్నాడు
దూరంపెట్టకు
దూరం చేసుకోకు
ఆదిభౌతికానికి ఆమడదూరమైపోకు
అంతర్యామికి స్పందించని జడుడివి కాకు
నీలోని దేవుడు దేవులాడు
నిన్ను నువ్వుగా దేవు(లా)డు
దౌడు...ధవుడు...దవ్వుదవ్వుల్లోంచి
దర్శనం కానీ
నీ దరికి నీ లోలోకి రానీ
తలుపులు తెరు, తలపులు తెరు
నీకు నువ్వు దగ్గరగా రా...!
దగ్గరగా... రా!
ఐక్యమైపో.

# సుధామ పరిచయం

| | | |
|---|---|---|
| **అసలు పేరు** | : | **అల్లంరాజు వెంకటరావు** |
| **జననం** | : | 25-11-1951 విశాఖ జిల్లా అనకాపల్లి పట్టణంలో |
| **తల్లిదండ్రులు** | : | కీ॥శే॥ అల్లంరాజు (ద్విభాష్యం) రాజేశ్వరమ్మ<br>కీ॥శే॥ అల్లంరాజు కామేశ్వరరావు |
| **విద్యాభ్యాసం** | : | ఒకటో తరగతి నుండి ఎం.ఓ.యల్, ఎం.ఫిల్ వరకు హైదరాబాద్‌లోనే. కేశవ మెమోరియల్ పాఠశాల, మలక్‌పేట ప్రభుత్వ పాఠశాల, వివేకవర్ధనీ కళాశాల, ఆంధ్ర సారస్వత పరిషత్తు ప్రాచ్యకళాశాల, ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాలల్లో. |
| **వృత్తి ఉద్యోగాలు** | : | 1975-1977 బిషప్ సాలమన్ జూనియర్ కళాశాల కరీంనగర్ తెలుగు లెక్చరర్‌గా.<br>1978లో ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రంలో (వివిధ భారతి) ట్రాన్స్‌మిషన్ ఎక్జిక్యూటివ్‌గా చేరిక.<br>1990 లో ప్రోగ్రామ్ ఎక్జిక్యూటివ్‌గా పదోన్నతి, విజయవాడ, వరంగల్, హైదరాబాద్ కేంద్రాలలో కార్యక్రమ నిర్వహణాధికారిగా పనిచేసి, 2008 లో ఆకాశవాణి వివిధ భారతి వాణిజ్యప్రసార విభాగం నుండి స్వచ్ఛంద పదవీ విరమణ, అనంతరం బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం ఎం.ఏ (తెలుగు) ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు అకడమిక్ కౌన్సిలర్‌గా కొన్నాళ్లున్నారు. |
| **అభిరుచులు** | : | కవిగా, సమీక్షకునిగా, రచయితగా, కార్టూనిస్టుగా, చిత్రకారునిగా, సినీ విశ్లేషకునిగా, కాలమిస్టుగా, వక్తగా, పదబంధ ప్రహేళికల వంటి వివిధ పజిల్స్ నిర్మాతగా, సాహితీవేత్తగా తెలుగు పాఠకలోకానికి, సాహితీలోకానికి పరిచితులు. రేడియో'వాడి'గా శ్రోతలకు పరిచితులు.<br>దూరదర్శన్, ఈటీవి-2 వంటి టీవీ మాధ్యమాల్లోనూ పలు రచనలు, ఇంటర్వ్యూలు చేసారు. |

| | | |
|---|---|---|
| **ముద్రిత గ్రంథాలు** | : | <u>**కవితా సంపుటాలు**</u><br>అగ్నిసుధ - 1990<br>మనసు పావనగంగ - 2010<br>చిత్రగ్రంథి - 2011<br>కవికాలమ్ - 2011<br>తెమ్మెర - 2020<br><br><u>**వ్యాస సంపుటాలు**</u><br>సందర్భ - 2020<br>కాలం వెంట కలం - 2020<br><u>**కాలమ్ వ్యాసాలు :**</u><br>(ఆంధ్రభూమి, మన తెలంగాణ, విజయక్రాంతి దినపత్రికల కాలమిస్ట్‌గా వెలువరించినవి)<br>సం.సా.రా.లు - 2001 (సంస్కృతి-సాహిత్యం-రాజకీయాలు)<br>మన తెలంగాణ (సుధామయోక్తి) - 2018<br>వ'సుధా(స)మ'యం - 2019<br><br><u>**ఇతరాలు**</u><br>పూతరేకులు (జోక్స్‌బాక్స్) - 2012<br>రామాయణ పథం (ప్రశ్నోత్తరమాలిక-పజిల్స్) - 2018<br>భూమిక (సుధామ పీఠికలు-ముందుమాటలు) - 2018<br>మాటాట (గళ్ళ నుడికట్టు) - 2019<br>తెలుగు సొగసులు (విద్యార్థి యువతకై పరిచయవ్యాసాలు)<br>యువభారతి ప్రచురణ - 2020 |
| **అవార్డులు, సన్మానాలు** | : | 'అగ్నిసుధ' సంపుటానికి కలహంసి, ఉమ్మడిశెట్టి సాహితీ పురస్కారం, 'సం.సా.రా.లు' గ్రంథానికి తెలుగు విశ్వ విద్యాలయం 2014 సాహితీ పురస్కారం, వంశీ ఇంటర్నేషనల్, జోత్స్నకళాపీఠం, తేజఆర్ట్స్ కవితాపురస్కారం, మునిమాణిక్యం హాస్యనిధి పురస్కారం, నోరి నరసింహశాస్త్రి ఛారిటబుల్ ట్రస్ట్, |

దివాకర్ల సాహిత్య పీఠం వారి ఆచార్య దివాకర్ల వేంకటావధాని సాహిత్య పురస్కారం, ఆచార్య తిరుమల స్మారక సాహిత్య పురస్కారం, పింగళి జగన్నాథరావు స్మృతిసాహిత్య పురస్కారం, తురగా కృష్ణమోహనరావ్ హాస్య పురస్కారం, తిరుమల శ్రీనివాసాచార్య, స్వరాజ్యలక్ష్మి సాహితీ పురస్కారం, నవ్య సాహితీసమితి ఉగాది భాషాసేవా పురస్కారం, చేతన మాసపత్రిక, సృజనప్రియ మాసపత్రికల వార్షిక సన్మాన పురస్కారం, లేఖిని సంస్థ పురస్కారం, పోలవరం వెంకట సుబ్బమ్మ సాహితీ పురస్కారం, నెల్లూరు శ్రీమతి గుర్రాల రమణమ్మ సాహితీపురస్కారం, యువ కళావాహిని వారి శ్రీ వివేకానంద సాహిత్య ప్రతిభా పురస్కారం, ఖర్గపూర్, బెంగళూర్ తెలుగు సాహితీ సంస్థలచే, ప్రపంచ తెలుగు మహాసభలు, తానా, ఆటా హైదరాబాద్ సభల్లో, అ.జో.వి.భొ, కందాళై ఫౌండేషన్ ప్రతిభా పురస్కార సభలో, కృష్ణా జిల్లా రచయితల సంఘం వారి సన్మానాలు మొదలైనవి.

**1983లోనే ఆకాశవాణి జాతీయ కవిసమ్మేళనానికి తెలుగు కవిగా ఎంపికయి జాతీయకవిగా పేరొందారు.**

**ప్రస్తుతం** : యువభారతి సంస్థ ప్రచురణల ప్రధాన సంపాదకులు.

'వాయిస్ ఆఫ్ సీనియర్ సిటిజన్స్' మాసపత్రికలో 'సీ'నియర్ కబుర్లు' కాలమ్ నిర్వహణ. ఫ్రీలాన్స్ జర్నలిస్టుగా, సాహితీవేత్తగా ప్రస్థానం.


**జీవన సహచరి** : శ్రీమతి అల్లంరాజు (సూకూరు) ఉషారాణి

**కుమారుడు** : చి॥ అల్లంరాజు స్నేహిత్

**కోడలు** : చి॥సౌ॥ అల్లంరాజు (దువ్వూరి) లక్ష్మీస్రవంతి.

# తెమ్మెర Temmera

(కవిత్వం) (Poetry Anthology)



Sudhama

సుధామ

## "శేముషి + కృషి = సుధామ"

**–డా.సి.నారాయణ రెడ్డి**

## "కవిత్వ గుణాన్ని బట్టి చూస్తే నేడో రేపో తను మహాకవుల లిస్టులో చేరకపోడు"

**–శశాంక**

"Sudhama has a deep commitment for the best of human values.,he does not appear to sloganise any of the 'isms' as such and that perhaps adds a new poetic dimension to the thoughts. Fine style, at once poignant and chiselled,an organized thought pattern,a laudable philosophy of life,and searching enquiry into the hidden ramparts of man's mind make his poetry a thoroughly readable work with a sense of muse that lingers on and on."

**–Dr.Dhara Ramanadha sastry**

